జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 62 | హైదరాబాద్, డిసెంబర్ 21 సోమవారం 2020 | 8 పేజీలు | వెల : 5.00

## గురుద్వారాను సందర్శించిన ప్రధాని మోదీ!



న్యూఢిల్లీ,డిసెంబర్ 21, ప్రజాపాలన : ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు ఉదయం ఢిల్లీలోని గురుద్వారా రకాబగంజ్ చేరుకుని, గురు తేగ్‌బహదూర్‌కు నివాళులు అర్పించారు. ప్రధాని గురుద్వారా సందర్శన కార్యక్రమాన్ని ఉన్నట్టుండి నిర్ణయించుకున్నారు. ప్రధాని గురుద్వారా వరకూ చేరుకునే సమయంలో ఆయనకు ప్రత్యేక పోలీసు బందోబస్తు లేదు. అలాగే ఈ మార్గంలో ఎటువంటి ట్రాఫిక్ మళ్లింపులు చేయలేదు. ఈ రోజు ఉదయాన్నే మంచుకురుస్తుండగా, ఒక సామాన్య వ్యక్తి మాదిరిగా ప్రధాని మోదీ గురుద్వారా చేరుకున్నారు. తరువాత ప్రధాని తన గురుద్వారా సందర్శనకు సంబంధించిన ఫొటో షేర్ చేశారు. దీనితోపాటు గురుముఖి భాషలో సందేశమిచ్చారు. తాను ఈ రోజు చారిత్రాత్మక గురుద్వారా రకాబగంజ్ సాహిబ్‌కు ప్రార్థనలు చేశానని. అక్కడ గురు తేగ్‌బహదుర్ పవిత్ర శరీరానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారని తెలిపారు. గురు తేగ్‌బహదూర్ ఈ ప్రపంచంలోని లక్షల మందిని ప్రభావితులను చేసి, ఆధ్యాత్మిక మార్గంవైపు మళ్లించారన్నారు. గురు సాహిబ్ విశేష కృపతోనే తమ ప్రభుత్వ పాలనా కాలంలో గురు తేగ్‌బహదూర్ 400వ ప్రకాశ్ పర్వాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా తేగ్ బహదూర్ ఆదేశాలను గుర్తు చేసుకుంటున్నామన్నారు. కాగా ఢిల్లీలో గురుద్వారా రకాబగంజ్ 1783వ సంవత్సరంలో నిర్మితమైంది.

## నా జీవితంలో ఇలాంటిది చూడలేదు

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా

కోల్‌కతా,డిసెంబర్ 21, ప్రజాపాలన : ఈరోజు పశ్చిమ బెంగాల్‌లోని బోల్‌పూర్‌లో నిర్వహించినటువంటి రోడ్‌షోను తన జీవితంలో చూడలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, ప్రేమ ఈ రోడ్‌షో ద్వారా కనిపించిందని ఆయన అన్నారు. బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని దానికి ఇదే సాక్ష్యమని అమిత్ షా చెప్పుకొచ్చారు."నా జీవితంలో ఎన్నో రోడ్‌షోలు చూశాను. చాలా ఏళ్లుగా దేశం మొత్తం తిరుగుతున్నాను. కానీ ఈరోజు బెంగాల్‌లో నిర్వహించిన ఇలాంటి రోడ్‌షోను నా జీవితంలో చూడలేదు. నరేంద్రమోదీపై ప్రేమకు నమ్మకానికి ఇది నిదర్శనం. ఇందులో బీజేపీపై ప్రజల ప్రేమ కనిపిస్తోంది. అలాగే దీదీపై (మమతా బెనర్జీ) కోపం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు" అని బోల్‌పూర్‌లో నిర్వహించిన రోడ్‌షోను ఉద్దేశించి అమిత్ షా అన్నారు.వచ్చే ఏడాది ప్రథమార్థంలో బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి పార్టీ కార్యకర్తలతో పాటు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున్న హాజరయ్యారు. స్థానిక హనుమాన్ మందిరం నుంచి ప్రారంభమైన ఈ



ర్యాలీకి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనం నుంచి అమిత్ షా అభివాదం చేస్తూ కనిపించారు. ఆయన వెంట బెంగాల్ బీజేపీకి చెందిన పలువురు నేతలు హాజరయ్యారు.

## నేటి నుంచి పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు




హైదరాబాద్,డిసెంబర్ 21, ప్రజాపాలన :ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సోమవారం నుంచి పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్ణయించింది. కార్డ్ సాఫ్ట్‌వేర్ ద్వారా వ్యవసాయేతర రిజిస్ట్రేషన్లు అడ్వాన్స్ స్లాట్ బుకింగ్ తాత్కాలికంగా నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పారదర్శకత పెరిగిందని సీఎస్ సోమేష్‌కుమార్ తెలిపారు. వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు మళ్లీ పాత పద్ధతిలోనే జరగనున్నాయి. ఈ నెల 14 నుంచి కొనసాగుతున్న ప్రస్తుత విధానాన్ని నిలిపివేస్తున్నట్లు, 21 (సోమవారం)న తిరిగి పాత పద్ధతిలో రిజిస్ట్రేషన్లను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ గతంలో సొంతంగా తయారు చేయించుకున్న 'కార్డ్ (కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్)' సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ రిజిస్ట్రేషన్లు చేపట్టనున్నట్లు పేర్కొంది. వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఆధార్ కార్డు కాలమ్‌ను తొలగించాలని, అప్పటివరకు స్లాట్ల బుకింగ్‌ను నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు నుంచి శుక్రవారం కాపీ అందకపోవడంతో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ల బుకింగ్ కొనసాగింది. హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం శనివారం నుంచి స్లాట్ల బుకింగ్‌ను నిలిపివేసింది.

## కొత్త సంవత్సరం నుండి కొత్త రూల్స్



న్యూఢిల్లీ,డిసెంబర్ 21, ప్రజాపాలన : కొత్త ఏడాదితోపాటు కొన్ని కొత్త రూల్స్ కూడా రానున్నాయి. వచ్చే జనవరి 1 నుంచి ఫాస్టాగ్‌తోపాటు జీఎస్టీ, చెక్ మోసాలు, పాజిటివ్ పే వ్యవస్థలాంటి వాటిలో నిబంధనలు మారుతున్నాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం.

1. ఫాస్టాగ్ తప్పనిసరి: వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఫాస్టాగ్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర రోడ్డు, రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం.. డిసెంబర్ 1, 2017కు ముందు తయారైన అన్ని నాలుగు చక్రాల వాహనాలకు ఫాస్టాగ్ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈ మేరకు కేంద్ర మోటారు వాహనాల చట్టం, 1989లో సవరణలు చేశారు.
2. చెక్కుల పాజిటివ్ పే వ్యవస్థ: జనవరి 1, 2021 నుంచి చెక్కులకు పాజిటివ్ పే వ్యవస్థను తీసుకురానున్నది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ). ఇందులో భాగంగా రూ.50 వేలకు మించిన చెక్కుల విషయంలో కీలక వివరాలను మరోసారి నిర్ధారించాల్సిన అవసరం రావచ్చు. చెక్కు జారీ చేసే వ్యక్తి చెక్కు నంబర్, తేదీ, పేయీ పేరు, అకౌంట్ నంబర్, అమౌంట్ వంటి వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది.
3. కాంటాక్ట్‌లెస్ కార్డ్ లావాదేవీ పరిమితి పెంపు: వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కాంటాక్ట్‌లెస్ కార్డ్ లావాదేవీ పరిమితిని పెంచుతూ ఆర్బీఐ ఈ మధ్యే కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఉన్న రూ.2 వేల పరిమితిని రూ.5 వేలకు పెంచింది.

మిగతా 2లో..

## కశ్మీర్ టు కన్యాకుమారి రైడ్-2020 ప్రారంభించిన గవర్నర్



హైదరాబాద్,డిసెంబర్ 21, ప్రజాపాలన : ఆదిత్య మెహతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కశ్మీర్ టు కన్యాకుమారి ఇన్‌ఫినిటివ్ రైడ్-2020 కు గవర్నర్ తమిళిసై ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కశ్మీర్ నుంచికన్యాకుమారి వరకూ నిర్వహిస్తున్న ఇన్‌ఫినిటివ్‌రైడ్-2020 సాహసోపేతమైన యాత్రగా పేర్కొన్నారు. ఈసందర్భంగా నిర్వాహకులను గవర్నర్ అభినందించారు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య జరిగే ఈ యాత్రలో ఎంతో ఉత్సాహంగా సైకిలిస్టులు పాల్గొనడం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

మిగతా 2లో..

## అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కేసీఆర్ కృషి చేస్తున్నారు:కొప్పుల



జగిత్యాల,డిసెంబర్ 21, ప్రజాపాలన : తెలంగాణలో అట్టడుగు వర్గాల అభ్యున్నది కోసం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు కృషి చేస్తున్నారని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అణగారిన వర్గాలను పైకి తీసుకు వచ్చేందుకు పలు పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నరు. అన్నిమతాలను టీఆర్ఎస్ ప్రభుత్వం సమానంగా గౌరవిస్తుందన్నారు. ఆదివారం పెగడపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయంలో క్రైస్తవులకు గిఫ్ట్ ప్యాక్‌లను మంత్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలు పేదలు ఘనంగా జరుపుకునేలా ప్రభుత్వం గిఫ్ట్‌ప్యాక్‌లు పంపిణీ చే స్తోందన్నారు. బతుకమ్మ పండగకు ఆడబిడ్డలకు చీరల పంపిణీ చేస్తున్నట్టుగానే రంజాన్, క్రిస్మస్ పండగలకూ దుస్తులు అందిస్తున్నామని అన్నారు. ఈసందర్భంగా మంత్రి క్రైస్తవులకు క్రిస్మస్ శుభా కాంక్షలు తెలిపారు.

## ఉపాధి హామీ పెండింగ్ నిధులను విడుదల చేయండి:ఎర్రబెల్లి

హైదరాబాద్,డిసెంబర్ 21, ప్రజాపాలన : ఉపాధి కల్పనలో దేశంలో నెంబర్ వన్ గా నిలిచిన తెలంగాణ రాష్ట్రానికి ఇస్తున్న అవార్డులతోపాటు, రావాల్సిన పెండింగ్ నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు గారు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి నరేంద్రసింగ్ తోమర్కు లేఖ రాశారు.తెలంగాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ రూపొందించిన అనేక పథకాలతోపాటు, 32 జిల్లాల్లో, 540 మండలాల్లోని 12,770 గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి ఎర్రబెల్లి కేంద్ర మంత్రికి రాసిన లేఖలో తెలిపారు. ఈ ఏడాది ఉపాధి పని దినాల లక్ష్యం 13.75 కోట్లు కాగా, 13.37 కోట్ల పనిదినాలను నిర్ణీత సమయానికి చాలా ముందే సాధించామన్నారు. అంటే 97.37శాతం లక్ష్య సాధనతో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిందని లేఖలో తెలిపారు.కరోనా సమయంలోనూ నగరాలు, పట్టణాల నుంచి గ్రామాలకు తిరిగి వెళ్ళిన లక్షలాది మంది వ్యవసాయ కూలీలకు కూడా ఉపాధి కల్పించినట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఈ ఏడాది రావాల్సిన వాటా 1719.25 కోట్లకు గాను ఇప్పటి వరకు 694.66 కోట్లు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. ఇంకా రావాల్సిన 1024.59 కోట్లు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి



చేశారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే పనులు పూర్తిచేసి బిల్లులు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేసిన పనులతో ఉపాధి హామీ పథకం ఆశయాన్ని నెరవేరుస్తూ, లక్ష్యాలను సాధిస్తూ, దేశంలో నెంబర్ వన్ గా నిలుస్తూ, అవార్డులు పొందుతూ, ఉపాధి హామీలో అగ్రగామిగా ఉన్న తెలంగాణ కి ఉపాధి హామీ పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి ఎర్రబెల్లి కేంద్ర మంత్రికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

PAY BACK TO SOCIETY SNEHA CLUB | SNEHA GROUP OF ORGANISATIONS 20 YEARS CELEBRATIONS | SNEHA MACS
స్నేహ మ్యూచువల్ ఎయిడెడ్
కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్
12 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని 32,300
మందిసభ్యులతో 40 కోట్ల
టర్నోవర్‌తో ప్రగతి పథంలో దూసుకుపోతున్న సంస్థ
స్నేహాక్లబ్ 20 సంవత్సరములు పూర్తి
చేసుకున్న సందర్భగా
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు
కానుకగా
మీ డిపాజిట్ 6 సం|| కే రెట్టింపు (Double)
డిపాజిట్ మీద 6 సం||లు కాలపరిమితి తప్పనిసరి
For further details contact
8886699256,7036355522,
9948725373, 8886699235
కార్పోరేట్ ఆఫీస్: 6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్-500 004
రిజిస్టర్ నెం. AMC/VSP/DCO/2008/2446 DATED 07-03-2008
మెయిన్ ఆఫీస్: డోర్ నెం.50-61-3,
సీతంపేట, రాజేంద్రనగర్, విశాఖపట్నం-16

## కొత్త సంవత్సరం నుండి కొత్త రూల్స్

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఇది పూర్తిగా వినియోగదారు విచక్షణాధికారంపైనే ఆధారపడి ఉంటుంది. అంటే యూజర్ కావాలనుకుంటే ఈ పరిమితిని రూ.5 వేలకు పెంచుకోవచ్చు. లేదంటే రూ.2 వేలకే పరిమితం చేయవచ్చు.

4. త్రైమాసిక జీఎస్టీ రిటర్న్ ఫైలింగ్ సౌకర్యం: దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 94 లక్షల మంది చిన్న వ్యాపారస్థులు ఇక సులువగా, మూడు నెలలకు ఓసారి గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) రిటర్న్ ఫైల్ చేసే సౌకర్యం కలగనుంది. ఏడాదికి రూ.5 కోట్ల లోపు అమ్మకాలు ఉండే వ్యాపారాలు దీని కిందికి వస్తాయి. ఇప్పటి వరకూ ప్రతి నెల ఒకటి చొప్పున 12 రిటర్న్ ఇవ్వాల్సి వచ్చేది. అయితే ఇక నుంచి మూడు నెలలకోసారి నాలుగు రిటర్న్ దాఖలు చేస్తే సరిపోతుంది.

5. ల్యాండ్‌లైన్ నుంచి మొబైల్‌కు కాల్ చేయాలంటే 0 తప్పనిసరి: వచ్చే ఏడాది జనవరి 15 నుంచి ల్యాండ్‌లైన్ నుంచి మొబైల్ ఫోన్‌కు కాల్ చేయాలంటే కచ్చితంగా ముందు 0 యాడ్ చేయాల్సిందేనని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డీఓటీ) స్పష్టంచేసింది.

6. టూ వీలర్, కార్ల ధరలు పెరుగుతాయ్: కొత్త ఏడాదితో పాటు టూ వీలర్, కార్ల ధరలు కూడా కొత్తవి రానున్నాయి. అన్ని తయారీ కంపెనీలు ధరలు పెంచడానికి సిద్ధమవుతున్నాయి. దేశంలో అతి పెద్ద కారు తయారీ సంస్థ మారుతీ సుజుకీ.. మోడల్‌ను బట్టి రేట్లు పెంచనుంది. ఇండియాలో తమ కార్ల ధరలు పెంచనున్నట్లు ఇప్పటికే ఎంజీ మోటార్స్ ప్రకటించింది. జనవరి నుంచి రెనాల్ట్ కార్ల ధరలు రూ. 28 వేల వరకు పెరగనున్నాయి. ఇక టూవీలర్లలో హీరో మోటోకార్ప్ తమ వాహనాల ధరలు రూ.1500 వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది.

## కశ్మీర్ టు కన్యాకుమారి రైడ్-2020 ప్రారంభించిన గవర్నర్

(మొదటి పేజీ తరువాయి)

ఆదిత్య మెహ తా ఇన్ఫినిటీ పారా స్పోర్ట్స్ అకాడమీ అండ్ రీహెబిలిటేషన్ సెంటర్ నిర్వాహకులను గవర్నర్ అభినందించారు. నవంబరు 19న శ్రీనగర్ నుంచి ఈ యాత్ర ప్రారంభమై హైదరాబాద్‌కు చేరుకుంది. ఇక్కడి నుంచి కన్యాకుమారికి బయలు దేరి వెళ్లింది. ఈసందర్భంగా రైడర్స్ 3,842 కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. శారీరకంగా ఎంతో ఛాలెంజింగ్‌తో కూడుకున్న ఈరైడ్ సక్సెస్ కావాలని గవర్నర్ అన్నారు. పారాస్పోర్ట్స్ ఈవెంట్స్ వంటివి యువతలో పోటీతత్వం, టీమ్ వర్క్, మనో వికాసం పెరుగుతుందన్నారు. ఆదిత్య ఫౌండేషన్ వారు సాహసోపేతంగా ఈ రైడ్ నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.

## ఉచిత వైద్య శిబిరం



వలిగొండ ప్రజాపాలన మండల పరిధిలోని నాతాళ్లగూడెం గ్రామంలో ఆదివారం చావా ఫౌండేషన్ భువనగిరి వారి సౌజన్యంతో ఆర్కే ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 126 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్ కుమార్,సర్పంచ్ ఉలిపే మల్లేశం,వలిగొండ మార్కెట్ క్షమిటి చైర్మన్ కూనపురి కవిత రాములు,ఎంపీటీసీ మోటే నర్సింహ,జూకంటి వెంకటేశం,పార్వతమ్మ,వార్డు సభ్యులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకులకు ఆర్‌బీఐ కీలక ఆదేశాలు...

ముంబై: గతంలో ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన భారీ రుణ ఖాతాలను 'మోసపూరిత' ఖాతాలుగా బ్యాంకులు గుర్తించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఆదేశించింది. దీనికి డిసెంబరు 31తేదీ గడువుగా పెట్టినట్లు వార్తా సంస్థ కోజెన్సిస్ వెల్లడించింది. 'హెచ్చరికలు జారీ చేసిన ఆయా ఖాతాల పరిస్థితిపై నివేదిక పంపడంతో పాటు, వాటిని సరిగ్గా వర్గీకరించడానికి ఆర్‌బీఐ ఈ గడువు నిర్ణయించింది. కొన్ని బ్యాంకుల్లో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు బలంగా లేకపోవడం వల్లే ఆర్‌బీఐ ఈ ఆదేశాలు జారీ చేసింద'ని బ్యాంకింగ్ అధికారి ఒకరు తెలిపారు. అటువంటి ఖాతాలను మోసపూరిత ఖాతాలుగా గుర్తించడం, లేదంటే క్రమబద్ధీకరించిన పక్షంలో ఖాతాను నవీకరించడం వంటి విషయాల్లో బ్యాంకులు వేగం కనబరచడం లేదని.. అందుకే ఆర్‌బీఐ ఈ అడుగులు వేస్తున్నదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. చాలా వరకు బ్యాంకులు కొన్నిఖాతాలను 'మోసపూరితమైనవి'గా గుర్తించాయి. అయితే అన్ని బ్యాంకులూ ఈ విషయంలో ముందుకు రావాల్సి ఉందని ఆర్‌బీఐ భావిస్తున్నట్లు సమాచారం. మోసపూరిత విభాగ ఖాతాలకు నాలుగు త్రైమాసికాల్లో 100 శాతం కేటాయింపులు జరపాల్సి ఉంటుంది. నిరర్థక ఆస్తుల విషయంలో ఎనిమిది త్రైమాసికాల్లో 100 శాతం కేటాయింపులు జరపాల్సి ఉంటుంది.

ప్రమాద హెచ్చరికలు ఎందుకంటే...?

బ్యాంకుల్లో అంతర్గతంగా నియంత్రిత వ్యవస్థలు సరిగ్గా పనిచేయడం లేదు. మోసాల విషయంలో మధ్య స్థాయి సిబ్బంది ప్రధాన కార్యాలయానికి సమాచారాన్ని చేరవేయడంలో ఆలస్యమవుతున్నది. అలాగే బ్యాంకు నుంచి క్రెడిట్ బ్యూరోలకు, క్రెడిట్ రిజిస్ట్రీకి చేరవేయడమూ ఆలస్యమవుతుండడంతో.. రుణ ఖాతాల గుర్తింపు, వర్గీకరణలో సమస్యలు వస్తున్నాయి. మోసపూరిత ఖాతాల గుర్తింపులో ఆలస్యం అవుతుండడంతో 2015లో ఆర్‌బీఐ ఈ 'రెడ్ ఫ్లాగ్డ్ అకౌంట్స్'(ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన ఖాతాలు) నమూనాను తీసుకొచ్చింది.

బకాయిల ఎగవేత లేదా కీలక వ్యక్తుల రాజీనామా వంటివి చోటు చేసుకున్నపుడు బ్యాంకులో ఏదో మోసం జరిగినట్లు గుర్తించి ఆర్‌బీఐ ఈ హెచ్చరికలు జారీ చేస్తుందన్నమాట. అపుడు బ్యాంకులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాల్సి ఉంటుంది. రూ.50 కోట్లకు పైగా రుణ ఖాతాల్లో మోసాలు జరిగినపుడు వాటిని కచ్చితంగా ఆర్‌బీఐకి చెందిన 'సెంట్రల్ రిపాజిటరీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆన్ లార్జ్ క్రెడిట్స్'కు నివేదించాల్సి ఉంటుంది. అయినా కూడా అటువంటి మోసాల గుర్తింపులో ఆలస్యం జరుగుతూనే ఉంది.

# వినాయకహిల్స్ కాలనీ వాసులతో బిజెపి నేతల సమావేశం

బాలాపూర్ : ప్రజాపాలన : బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వినాయక హిల్స్ లో బిజెపి కార్పొరేషన్ ఉపాధ్యక్షులు శివారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులతో ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథి నియోజకవర్గం ఇన్చార్జి అందెల శ్రీరాములు హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ.... కాలనీల సమస్యలు గాలికి వదిలిన టిఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ ఎన్నికల్లోఆర్కేపురం, సరూర్నగర్ డివిజన్లలో జయకేతనం ఎగరవేసిన బిజెపి అన్నారు. ప్రజల్లో ఉన్న మార్పు కాలనీల సమస్యలు తీర్చటంలో టీఆర్ఎస్ నేతలు, మంత్రి సబితా ఇంద్రారెడ్డి విఫలమయ్యారని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. ఆదివారం నాడు బడంగ్ పేట కార్పొరేషన్ అల్మాస్ గూడ వినాయక హిల్స్ కాలనీలలో కాలనీ వాసులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరటం ఖాయం అన్నారు. నగర జనాభాకు తగ్గట్టు మౌలిక వసతులు కల్పించడంలో టీఆర్ఎస్ సర్కారు విఫలమైందని విమర్శించారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పట్టించుకోవడం లేదన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఆర్కేపురం, సరూర్నగర్ డివిజన్లలో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన శ్రీరాములు యాదవ్ ను వినాయకునీ కాలనీ వాసులు అందరూ ఘనంగా సన్మానించారు. వినాయక హిల్స్ కాలనీ పెద్దలు. భవిష్యత్తులో బీజేపీ విజయానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాలనీవాసులు అందరికీ పేరుపేరు నా బీజేపీ నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో



అల్మాస్ గూడ కార్పొరేటర్లు పద్మా ఐలయ్య యాదవ్, రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, శూరకర్ణారెడ్డి, టేకుల భాస్కర్ రెడ్డి, జీ.ఎన్. దొడ్డి మల్లికార్జున్, వరికుప్పుల వెంకటేష్, జంగారెడ్డి, బంగారి బాబు, టీ. సంతోష్, దశరథ్ గౌడ్, శ్రీకాంత్, శివరామ్ రెడ్డి సహా బీజేపీ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# 23న చలో వికారాబాద్ గిరిజన గర్జన సభ

### మాజీ మంత్రి గిరిజన జాతీయ నాయకుడు రవీందర్ నాయక్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 20 ( ప్రజాపాలన ) : పేదరికం వలన గిరిజనుల ఆడపిల్లలు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి ధరావత్ రవీందర్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని కొత్తగడిలో వికారాబాద్ జిల్లా అఖిల భారత గిరిజన సమాఖ్య అధ్యక్షుడు కరంతోట్ రాఘవన్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ జాధవ్ గెస్ట్ హౌజ్ లో మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం పాలన, సాంఘిక న్యాయం, నీళు ్ళ, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి లాగిన ఘనత సిఎం కేసిఆర్ కు దక్కుతుందని విమర్శించారు. దళిత ముఖ్యమంత్రిని చేస్తానని ఉత్తర ప్రగల్భాలు పలికి కేసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాడని ఎద్దేవా చేశారు. బంగారు తెలంగాణకు బదులు కేసిఆర్ బంగారు కుటుంబంగా మార్చుకున్నాడని అన్నారు. 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని మాట ఇచ్చి తప్పాడని పేర్కొన్నారు. లంబాడాల జాతి అభివృద్ధికి సహకరించకపోగా గోండులను ఉసిగొల్పుతున్నాడని విమర్శించారు. 70 అసెంబ్లీ స్థానాలలో గిరిజనుల ఓట్లతోనె ఎమ్మెల్యేలంగా గెలవగలుగుతున్నారని అన్నారు. టిఆర్ఎస్ ను, కేసిఆర్ ను బొందపెట్టే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న బేటీ బచావో బేటీ పఢావో వంటి పథకాలను కాలరాస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు వెంకన్న నాయక్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రేఖాసింగ్, ఎన్ఎఫ్సి సైంటిస్ట్ పిక్లా నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి హరి నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ జాధవ్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు తుల్సీరాం నాయక్ తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# అసత్య ఆరోపణలు గ్రామాభివృద్ధికి ఆటంకం

### మైలార్దేవరంపల్లి సర్పంచ్ ఆలంపల్లి తిరుపతిరెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 20 ( ప్రజాపాలన ) : అసత్య ఆరోపణలు గ్రామాభివృద్ధికి ఆటంకమవుతాయని మైలార్దేవరంపల్లి గ్రామ సర్పంచ్ ఆలంపల్లి తిరుపతి రెడ్డి హితవు పలికారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మైలార్దేవరంపల్లి గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నామని అన్నారు. అది చూసి ఓర్వలేని విపక్ష పార్టీలకు చెందిన ముగ్గురు వార్డు మెంబర్లు లేని పోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. 2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎలక్షన్లో పోటీ చేసి నా దగ్గర చిత్తు చిత్తుగా ఓటమి చెందిన అభ్యర్థులు వాళ్ల అనుచరులు ఆ ఓటమిని జీర్ణించుకోలేక నాపై రాజకీయ దురుద్దేశంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. శనివారం నాపై ఆరోపణలు చేసిన ఆరుగురు ఆరు రకాల బాధలతో ఉన్నారని దెప్పి పొడిచారు. ఒక వ్యక్తికి పన్నెండు ఓట్లు వచ్చాయని బాధ ఇంకొకరికి ఉపసర్పంచి పదవి రాలేదన్న బాధ ఇంకొకరు వాళ్ల అన్న సర్పంచుకు పోటీచేసి ఓడిపోయిందని బాధ ఇంకొకరు తమ మద్దతు తెలిపిన అభ్యర్థి ఓడిపోయాడని బాధ ఇంకొకరు దళితుల ఎదుర్కోళ్ల స్థలాన్ని దళితులు తీసుకొన్నందున హోటల్ పోయిందనే బాధ ఇంకొకరు డబ్బులు పర్సెంటేజీ రూపంలో ఇస్త లేనని బాధతో వాళు ్ల వాళ్ల వ్యక్తిగత బాధలను తెచ్చి నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేయవలసినటు వంటి అవసరం మాకు లేదు. చేయని పనులను చేసినట్లు బిల్లులు పెట్టి రికార్డులు సృష్టించి తీసుకోవాల్సినటువంటి అవసరం మాకు లేదు. అవినీతి జరిగిందని ఆధారాలతో నిరూపించాలి. ఏదేదో ఊహించుకుని మీకు నచ్చిన విధంగా ఆరోపణలు చేసినంత మాత్రాన అది నిజం కాదు. నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

# ప్రజా సేవే ప్రథమ కర్తవ్యం

### జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 20 ( ప్రజాపాలన ) : ప్రజా సేవే ప్రథమ కర్తవ్యంగా పార్టీ పటిష్ఠతకు అహర్నిశలు కృషి చేస్తానని జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాపాలన జిల్లా ప్రతినిధితో మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి నేను పార్టీకి చేసే సేవలను గుర్తించి నాకు రెండవ సారి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు అప్పగించిన జిల్లా బిజెపి అధ్యక్షుడు సదానంద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జెండాను, సంక్షేమ పథకాలను గడపగడపకు చేర్చుటకు నిర్విరామంగా కృషి చేస్తాను అన్నారు. పార్టీ అవసరాలకు అనుగుణంగా వ్యవహరించి కార్యకర్తలను చైతన్యం చేస్తానని పేర్కొన్నారు. బూత్ స్థాయిలో బిజెపి బలపడే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని సామాన్య ప్రజల చెంతకు చేర్చే వరకు విశ్రమించను అన్నారు. నాతో పాటు రమేష్, గణపురం వెంకటయ్యలు పాల్గొన్నారు.

## అన్నదాతలకు అండగా నిలుద్దాం.. అన్నం మెతుకు రుణం తీర్చుకుందాం



అమీర్ పేట జోన్ డిసెంబర్21(ప్రజాపాలన):గడ్డ కట్టే చలిలో వ్యవసాయ వ్యతిరేక చట్టాల రద్దుకై పోరాడుతున్న రైతు లకు కవులు, కళాకారుల మద్దతు ఉంటుందని తెలంగాణ రచయిత ల వేదిక అధ్యక్షుడు గాజోజు నాగభూషణం తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నం మెతుకు రుణం తీర్చు కొనేందుకు హలాలకు కలాల సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఇప్పటి కైనా కేంద్ర ప్రభుత్వం ఆ వ్యవసాయ వ్యతిరేక చట్టాల ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, కళాకారులు పాల్గొని రైతు లకు మద్దతు తెలిపారు.

## అభివృద్ధి పనులకు పలు డివిజన్లలో శ్రీకారం చిన్న మంత్రి



బాలాపూర్ : ప్రజాపాలన : మీర్పేట్ మున్సిపల్ కార్పోరేషన్లొ 63 లక్షల 45 వేల రూపాయల తో అభివృద్ధే లక్ష్యంగా పలు డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మంత్రి సబిత ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి,కాలనీవాసులు అందరికీ దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుమన్ రావు, డి ఇ సత్యనారాయణ, ఏ ఈ .కృష్ణయ్య మున్సిపల్ అధికారులు మరియు కార్పోరేటర్లు, కొ ఆప్షన్ సభ్యులు మీర్పేట మున్సిపల్ కార్పొరేషన్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సిద్దాల లావణ్య బీరప్ప , మరియు టీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలి

వలిగొండ ప్రజాపాలన : భువనగిరి నుండి చిట్యాల వరకు వెళ్లే రోడ్డుకు గుంతలు పడి పూర్తిగా ధ్వంసం అయిందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భువనగిరి నుండి చిట్యాల వరకు ఉన్న రోడ్డుకు పెద్దపెద్ద గుంతలుపడి ప్రమాదాలు జరుగుతున్నాయని,మండలంలోని సంగెం నుండి ప్రారంభమయ్యే మూసి కాల్వ వెంట వర్షాలకు అక్కడక్కడ గండ్లు పడి చెరువులలోకి నీరు రావడం లేదని,కాల్వ ద్వారా వచ్చే నీరు మూసిలోకి వృధాగా పోతుందని,చెరువులోకి నీరు రాక రైతులు వ్యవసాయం సాగుచేసే పరిస్థితి లేదని,కాల్వల మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని,ఇప్పటికైన ఎమ్మెల్యే,అధికారులు వెంటనే స్పందించి రోడ్ల మరమ్మతులు,కాల్వల మరమ్మతులు చేపట్టాలని,లేని పక్షంలో ఈ నెల ఆకరులో పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలను,రైతులను సమీకరించి ఉద్యమం చేపట్టవలిసి వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అరూర్ పిఏసిఎస్ మాజీ చైర్మన్ వాకిటి అనంతరెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి,బిసి సెల్ మండల అధ్యక్షుడు బొల్ల శ్రీనివాస్,పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య నాయకులు కొమురయ్య,సయ్యద్,( శీను,నరేందర్,తిరుపతయ్య,ధనంజయ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ విద్యా వ్యవస్థలో నాణ్యత ప్రమాణాల పెంపుకు కృషి

### ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళింగ క్రిష్ణ కుమార్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 20 ( ప్రజాపాలన ) : ఇంటర్ విద్యా వ్యవస్థలో నాణ్యత ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళింగ క్రిష్ణ కుమార్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వికారాబాద్ లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లు, ప్రిన్సిపాల్ల సంఘాల సంయుక్త సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను వినూత్నంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు అందచేయడం ద్వారా జెఈఈ, నీట్ ఉచిత శిక్షణ ఇవ్వడం ద్వారా ఇంటర్ విద్యను పేద విద్యార్థులకు మరింత చేరువ చేశామని అన్నారు. ఇంటర్ విద్యా వ్యవస్థలో ప్రతి అధ్యాపకుని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం 2021-23 సంవత్సరాల కాలానికి ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం వికారాబాద్ జిల్లా కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. జిజెఎల్ఏ జిల్లా అధ్యక్షునిగా సురేశ్వర స్వామి, ఉపాధ్యక్షునిగా సాయినాథ్, కార్యదర్శిగా బుచ్చయ్య, సంయుక్త కార్యదర్శిగా మల్లినాథప్ప ఆర్థిక కార్యదర్శిగా గురుపాదప్ప, ఈసి మెంబర్ గా పందరి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా జిల్లా ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు చెన్నయ్య వ్యవహరించారు. అనంతరం వికారాబాద్ జిల్లా జిజెసి ప్రిన్సిపాళ్ల సంఘ కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా చెన్నయ్య, ఉపాధ్యక్షునిగా రాజ్ మోహన్, కార్యదర్శిగా నర్సింహా రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా కుమార స్వామి, మహిళా కార్యదర్శిగా శోభా రాణి, ఈసి మెంబర్లుగా శంకర్, రజిత ఎన్నికయ్యారు. ప్రిన్సిపాళ్ల సంఘం ఎన్నికల అధికారిగా మెదక్ జిల్లా ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు అవనీష్ రెడ్డి వ్యవహరించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రిన్సిపాళ్ల జిల్లా కార్యవర్గ సభ్యులు ముఖ్య అతిథి కళింగ క్రిష్ణ కుమార్ ను ఎన్నికల అధికారి అవనీష్ రెడ్డిని శాలువాల తో సన్మానించారు.



## ఇలాన్ లో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



మధిర, డిసెంబర్ 21, ప్రజాపాలన : సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఆదివారం మండలంలోని ఆత్కూరు గ్రామంలో ఉన్న ఇలాన్ ఆగ్రో కెమికల్స్ పరిశ్రమ నందు సుబ్రహ్మణ్య స్వామికి ఇలాన్ ఆగ్రో కెమికల్స్ అధినేత ఇరుకుళ్ళ బాలకోటి శ్రీదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మ విద్యకు, జ్ఞానానికి,సంతాన సౌభాగ్యాలను ప్రతీక. ఈ రోజున సుబ్రహ్మణ్యుని ఆరాధిస్తే అభీష్టసిద్ధి, సంతాన వృద్ధి, అరిష్ట నివారణ జరుగుతాయి. స్వామి వారికి ఇష్టమైన నైవేద్యం నువ్వులు బెల్లం కలిపి చేసే చిమ్మిలి స్వామి వారికి ఎంతో ప్రీతిపాత్రమైనదని పురాణ గాథలు చెబుతున్నాయి. దీంతో పరిశ్రమలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రైతుకు కరెంటు షాక్



మధిర, డిసెంబర్ 21, ప్రజాపాలన : మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామం లో ఓట్ల సాంబయ్య గారి పొలము ను కృష్ణాజిల్లా శివాపురం గ్రామానికి చెందిన తుమ్మల వెంగళరావు వయసు 48 సంవత్సరాలుఅనే వ్యక్తి కౌలుకు తీసుకొని పొలాన్ని కి నీళు పెడుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగలడంతో అక్కడ ఉన్న స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో మధిర నుండి 108 అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకొని గజ్జలకొండ శివ నాగేశ్వరావు అక్కడికి వెళ్లి వెంగళరావును పరీక్షించ గా అతను మరణించినట్లు గుర్తించడం జరిగింది ఈ సమాచారాన్ని మధిర టౌన్ ఎస్ఐ గారికి కూడా తెలపడం జరిగింది.

## కార్పొరేషన్ డివిజన్‌లో ప్రణాళిక ప్రకారం మరమ్మతులు



బాలాపూర్ : ప్రజాపాలన : బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 7వ డివిజన్ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదిత్య నగర్ కాలనీలో డ్రైనేజీ త్రాగునీటి సమస్య లపై మేయర్ కు వినతి పత్రం సమర్పించారు. స్థానిక కార్పొరేటర్ మాట్లాడుతూ.... గత కొంత కాలంగా కాలనీవాసులు పడుతున్న త్రాగు నీటి సమస్య విపరీతంగా ఉందని, అదేవిధంగా డ్రైనేజ్ వల్ల ఇబ్బందులు పడుతున్నారునీ మేయర్ దృష్టికి తెలిపారు. బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత నరసింహారెడ్డి కాలనీల సమస్యలపై స్పందించిన కాలనిలో బస్తీ బస్తీ తిరిగి పరిశీలించారు. అక్కడున్న కాలనీవాసులు అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులతో త్వరలోనే ప్రణాళిక ప్రకారం సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. త్రాగునీటి సమస్య అధికారులతో పరిశీలించి అతి తొందరలో అయ్యేవిధంగా అదేవిధంగా డ్రైనేజ్ పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి, టీఆరెఎస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డిమరియుకాలనీవాసులు పాల్గొన్నారు.

# కొవిడ్ బారినపడిన కుటుంబాలకు మంత్రి చలవతో డ్రై రేషన్ అందజేత



బాలాపూర్ : ప్రజాపాలన : ఆదివారం నాడు బాలాపూర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొవిడు బారినపడిన నాలుగు కుటుంబాలకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి గారి ఆదేశానుసారం భారత గ్రామ నవ నిర్మాణ సంస్థ మారి స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో డ్రై రేషన్ అందజేసిన మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ మారి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సిలివేరి సాంబశివ, నర్సింగ్ ఆఫీసర్స్ సుధాకర్ మారి స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్ సురేందర్ మరియు సిల్మా నాయక్ (ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు) తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవులకు క్రిస్టమస్ శుభాకంక్షాలు మరియు దుస్తుల పంపిణి

### సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా కలెక్టర్ జి.రవి



ధర్మపురి, డిసెంబర్ 19 (ప్రజాపాలన): క్రిస్మస్ పర్వదిన వేడుకలను పురస్కరించుకొని ధర్మపురి నియోజకవర్గ క్రిస్టియన్ సోదర, సోదరిమను లందరికి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ధర్మపురి ఎంపిడిఓ కార్యాలయంలో 2500 మందికి క్రిస్మస్ దుస్తులను పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో మునిసిపాలిటీ ఛైర్ పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపిపి చిట్టి బాబు, ధర్మపురి జెపిటిసి బత్తిని అరుణ, ఎఎంసి ఛైర్మన్ అయ్యోరి రాజేష్, బుగ్గారం జెడ్పిటిసి బాదినేని రాజేందర్, జిల్లా కలెక్టర్ జి.రవి, డి.ఎం.డబ్ల్యూఓ వరదరాజన్, క్రిస్టియన్ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు చదువుతోపాటు కరాటే బాక్సింగ్ సెల్ఫ్ డిఫెన్స్ అవసరం



బాలాపూర్ : ప్రజాపాలన : బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని సాయి గ్రీన్ రిచ్ కాలనిలో చిల్డ్రన్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో ప్లే గ్రౌండ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి, వాటర్ బోర్డు ఛైర్మన్ తెలంగాణ ప్రకాష్ గార్ల చి గ్రౌండ్ ని ప్రారంభించారు. కార్పొరేషన్ మేయర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.... పిల్లలు చిన్న తనం నుండే ఆటలు అలవరుచుకోవలని అలాగే కొన్ని సెల్ఫ్ డిఫెన్స్ కోసం కరాటే, బాక్సింగ్ లాంటివి నేర్చుకోవాలని ప్రస్తుత కాలంలో ముఖ్యంగా మహిళకు రక్షణ లేకుండా పోతుందని దానికి ఉదాహరణ మొన్న జరిగిన దిశ ఘటనే ఉదాహరణ అని అన్నారు. చదువులో రాణించి, ఉన్నత ఉద్యోగం సంపాదించిన కూడా చదువు రాని, మూరు?ల చేతిలో హతం అయ్యిదని అలా కాకుండా వారిని ఎదుర్కొనే సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకొంటే ఆమె ఈరోజు బ్రతికి ఉండేదని అన్నారు. అందుకు ప్రతి పిల్లలు శ్రద్ధతో సెల్ఫ్ డిఫెన్స్ కరాటి బాక్సింగ్ అవసరమని చక్కగా బోధించారు. ఈ కార్యక్రమంలో చిగిరింత తిరుపతి రెడ్డి, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ కుమార్, కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మోసం..

### మద్దతు ధరలేక రైతులను నట్టేట ముంచిన సీఎం

జగిత్యాల, డిసెంబర్ 19 (ప్రజాపాలన): జగిత్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాలి రాజన్న మాట్లాడుతూ వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులను మోసం చేయడానికి ఉద్యోగాల ప్రకటన పేరిట ఓట్లు దండుకోవడానికి సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. శాసనసభ సాదారణ ఎన్నికల్లో నిరుద్యోగ భృతి ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి నిరుద్యోగ యువతను రోడ్లపై వదిలిపెట్టిన ఘనుడు కేసీఆర్ అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని నిరుద్యోగులకు సలహా ఇచ్చారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని మద్దతు ధర కోసం ధర్నాలు రాస్తారోకోలు చేసిన రైతులను పట్టించుకునే పాపాన పోలేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రాన్నీ అప్పుల ఊబిలోకి తోక్కి ప్రతి ఒక్కరి నేత్తిపై వేల రూపాయలను అప్పుల మూటగట్టిన సీఎం కేసీఆర్ ను నమ్మవద్దని నిరుద్యోగులకు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు యువత కన్వీనర్ కోరుకంటి రాము పాల్గొన్నారు.




## నాదర్గుల్ గ్రామంలో క్రికెట్ క్రీడా ప్రాంగణం ప్రారంభం



బాలాపూర్ : ప్రజాపాలన : బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలో సీ.ఆర్.ఆర్.ఐ.కే 11-క్రికెట్ గ్రౌండ్ ను భాగ్యనగర్ బ్యాంకు ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి చే ప్రారంభించారు. గ్రౌండ్ యజమాని కొండల్ రెడ్డి తల్లిదండ్రులతో కలిసి పూజలు చేసి రిబ్బన్ కట్ చేశారు. బ్యాంక్ ఛైర్మన్ మాట్లాడుతూ... నాదర్ గుల్ గ్రామం లో అన్ని మౌలిక వసతులు, ఉండాలని క్రీడాప్రాంగణాల ఏర్పాటుతో అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. యువతకు శారీరక శ్రమ తగ్గటం వల్ల చిన్నతనంలోనే అనారోగ్యాల పాలు అవుతున్నారని చెప్పారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శరీరధృడత్వం పెరుగుతుందని నర్సింహారెడ్డి తెలిపారు. కాసేపు బ్యాట్ పట్టి షాట్ లు కొట్టి యువతను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ది భాగ్యనగర్ సహకార సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ మర్రి నరసింహారెడ్డి, గ్రౌండ్ యజమాని కొండల్ రెడ్డి కుటుంబసభ్యులు, పాల్వయి శ్రీను, లక్ష్మణ్, తిరుపెల్లి సుధాకర్, జనిగె శివ, శ్రీను సహా స్థానికులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్



జగిత్యాల, డిసెంబర్ 20 (ప్రజాపాలన):జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 29 మంది లబ్ధిదారులకు 7లక్షల 64 వేల రూపాయలు విలువగల చెక్కులను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనేక మంది పేద ప్రజలు డబ్బులు లేక ఆస్పత్రుల్లో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని దీనిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద ప్రజల ప్రాణాలను కాపాడడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో ఎంతో మంది పేద మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ఎంపీపీ జడ్పీటీసీ సర్పంచులు ఎంపీటీసీలు తెరాస నాయకులు పాల్గొన్నారు

## వైభోగంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం



మధిర, డిసెంబర్ 21, ప్రజాపాలన : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో ఈ రోజున వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం మరియు తులసీ ధాత్రి కళ్యాణం అంగరంగ వైభవంగా ఈ రోజున శ్రీమాన్ శ్రీనివాస శేషాచార్యులు గారు బృందంతో వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు తదుపరి ఈ కార్యక్రమానికి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్రావు మరియు దేవాలయ కమిటీ బృందం పాల్గొన్నారు అలాగే ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్త బృందం భజన కార్యక్రమం చేపట్టినారు భక్తులందరూ స్వీయ నియంత్రణ పాటిస్తూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది.

## సెలవు రోజుల్లో ప్రజా సమస్యలపై అవగాహన



బాలాపూర్ : ప్రజాపాలన మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఆదివారం ప్రజా సమస్యల పరిష్కారం కొరకై 37వ డివిజన్లోనీ కార్పొరేటర్ మోడల బాలకృష్ణ ఆధ్వర్యంలో జయ శ్రీనగర్ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. కాలనీ లో ఉన్నటువంటి డ్రైనేజీ గాని మంచి నీటి గురించి అకాల వర్షాలకు పాడైపోయిన టువంటి సిసి రోడ్లు అదేవిధంగా ఇంట్లో ఉన్న చేతి పంపు రిపేరింగ్ కొరకు వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతూ, కాలనీవాసులు కార్పొరేటర్ ను కోరారు. ఈ పనులు వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి మీరిచ్చిన కాంప్లైట్ ద్వారా అతి తొందరలో పనులు అన్ని చేయిస్తానని కాలనీవాసులకు కార్పొరేటర్ మోడల బాలకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ రాజు, జనరల్ సెక్రటరీ సురేందర్ రెడ్డి, పెద్దలు రాజ, మల్లయ్య , సాంబశివరావు, మరియు కాలనీ వాసులు అంతా పాల్గొన్నారు.

## 50 వేల ఉద్యోగాలు ఉత్త బూటకం:కాంగ్రెస్ నాయకులు




వెంట్ పల్లి, డిసెంబర్ 20(ప్రజాపాలన): ఇండియన్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామ్రాట్ వంశీ వేములవాడ నియోజకవర్గంలో మరియు కోరుట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆఫీస్ లో భేటీ అయ్యి 50,000/-ఉద్యోగాలు ఒక బూటకమని రానున్న ఎమ్ ఎల్ సి ఎన్నికల కోసమే కేసీఆర్ కొత్త నాటకం చేస్తున్నారు, నిజమైతే తొందరగా నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఉపాధ్యక్షుడు వంశీ కాశవత్రి, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపల్ రెడ్డి, కరీంనగర్ నియోజకవర్గా ఉపాధ్యక్షుడు సాయి రావ్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన

సంపాదకీయం

సోమవారం 21, డిసెంబరు 2020

# సంక్షేమ రాజ్యానికి నైపుణ్యాల బాట

'సంక్షేమ రాజ్య వ్యవస్థ'ను నిర్మించాలని మన రాజ్యాంగం నిర్దేశిస్తోంది. రేపటి పౌరులను సుశిక్షిత నిపుణులుగా తీర్చిదిద్దగల విద్యావ్యవస్థతోనే ఇది సాధ్యం. ఉపాధ్యాయుల సంక్షేమం కంటే విద్యార్థి శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చినప్పుడు మాత్రమే అటువంటి ఆదర్శ విద్యావ్యవస్థ విలసిల్లుతుంది. ఇది నిజమయినప్పుడు ప్రపంచానికి సామాన్య నిపుణులైన వెల్డర్లను మాత్రమే కాకుండా అధునాతన ప్రతిభాపాటవాల సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్లను కూడా పెద్దసంఖ్యలో మనమే సమకూర్చగలుగుతాం.అభివృద్ధి చెందిన దేశాలలో నిపుణ కార్మికుల కొరత అత్యధికంగా ఉండగా వర్ధమాన దేశాలలో అనిపుణ కార్మికులు అవసరాలకు మించి చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. సంపన్న దేశాలలో ఉన్నత పాఠశాల, ఆ పై స్థాయి విద్యార్హతలు గల నిపుణ కార్మికులు అవసరాల కంటే 8.5 కోట్ల మంది తక్కువగా ఉన్నారని, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్హతలు గల అనిపుణ కార్మికులు అవసరాలకు మించి 9.5 కోట్ల మంది అధికంగా ఉన్నారని మెక్ కిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ఒకటి వెల్లడించింది. ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్హతలు గల మన అనిపుణ కార్మికులకు అధునాతన వృత్తి నైపుణ్యాలను చేకూర్చిన పక్షంలో ప్రపంచదేశాలకు అవసరమైన నిపుణ కార్మికులను అత్యధిక సంఖ్యలో సమకూర్చగల సామర్థ్యం మనకు లభిస్తుంది. అయితే వాస్తవ పరిస్థితులు నిరాశాజనకంగా ఉన్నాయి. మనదేశంలో వెల్డర్ల కొరతను భర్తీ చేసేందుకు చైనా, రష్యా, తూర్పు యూరోపియన్ దేశాల నుంచి కనీసం 10,000 మంది వెల్డర్లను దిగుమతి చేసుకొంటున్నామని ఎస్. శ్రీనివాసన్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వెల్డింగ్ అధ్యక్షుడు) తెలిపారు. ఒకవైపు ప్రపంచానికి నిపుణ కార్మికులను సరఫరా చేయగల సామర్థ్యం మనకు ఉందని భావిస్తున్నాం. మరోవైపు వెల్డర్ల లాంటి సాధారణ నిపుణ కార్మికులను సైతం సొంతంగా సమకూర్చుకోలేని పరిస్థితిలో ఉన్నాం! 'స్కిల్ డెవెలప్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్ షిప్' (ఎమ్ఎస్‌డిఇ) అనే ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సృష్టించారు. ప్రస్తుత విద్యావ్యవస్థలోని లొసుగులను అధిగమించి కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశారు.

అయితే 2020-%--%21 ఆర్థికసంవత్సరంలో ఎమ్ఎస్‌కి బడ్జెట్ కేటాయింపులు కేవలం రూ.3000 కోట్లు కాగా విద్యా మంత్రిత్వశాఖకు కేటాయింపులు రూ.99,000 కోట్లు. అడవిలో రాజుకున్న మంటలను కేవలం మూడు బకెట్‌ల నీటితో ఆర్పగలమా? మరో ముఖ్యమైన విషయమేమిటంటే వెల్డర్లకు అధునాతన నైపుణ్యాలను సమకూర్చే విషయంలో ఎమ్‌డిఇ ఏమాత్రం శ్రద్ధాసక్తులు చూపడం లేదు. అధునాతన నైపుణ్యాల అభివృద్ధికి మాత్రమే అది ప్రాధాన్యమిస్తోంది. అమెజాన్, గూగుల్, అదాని, యుబెర్, మారుతి, మైక్రోసాఫ్ట్ మొదలైన కంపెనీలతో ఈ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇది మంచి పనే, సందేహం లేదు. అయితే ప్రపంచవ్యాప్తంగా నర్సులు, టీచర్లు, ఫిజియోథెరపిస్టులు, అనువాదకులు మొదలైన నిపుణుల కొరతను భర్తీ చేయడం ఎలా సాధ్యపడుతుంది. ఎమ్ఎస్‌డిఇ అధికారుల కుమారులు, కుమార్తెలు వెల్డర్లు కావాలని, ఆశించరు కదా. కనుకనే ఆ మంత్రిత్వశాఖ అధునాతన నైపుణ్యాల అభివృద్ధి పైనే దృష్టిని కేంద్రీకరించింది. అమెజాన్, మైక్రోసాఫ్ట్ మొదలైన కంపెనీలతోనే దాని ఒప్పంద వ్యవహారాలు అన్నీ సాగుతున్నాయి ఫలితంగా నైపుణ్యాల అభివృద్ధి అనేది వెనక పట్టు పట్టింది. ప్రభుత్వ విద్యావ్యవస్థను సంస్కరించడం ఒక అసాధ్య కార్యమని ప్రపంచవ్యాప్తంగా పలుదేశాలు, మనదేశంలో అనేక రాష్ట్రాలు గుర్తించాయి. ఈ కారణంగానే అవి వోచర్ విధానాన్ని ప్రవేశపెట్టాయి. ప్రభుత్వం సమకూర్చే వోచర్లతో విద్యార్థి తాను కోరుకున్న విద్యాసంస్థలో విద్యాభ్యాసం చేయగల సదుపాయం లభిస్తుంది. 'సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ' నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం హాంకాంగ్‌లో విద్యార్థులు చెల్లించే ఫీజులో కొంత భాగాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోంది. అలాగే పాకిస్థాన్ ప్రభుత్వం కూడా కొన్ని రాష్ట్రాలలో విద్యార్థులు ఎంచుకున్న విద్యాసంస్థకు నెలకు రూ.550 నుంచి రూ.1100 దాకా నేరుగా చెల్లిస్తోంది. ఫలితంగా ఆ పాఠశాలల్లో చదువును మధ్యలో ఆపివేసే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. గణితశాస్త్ర బోధన బాగా మెరుగుపడింది. ఫిలిప్పీన్స్‌లో కూడా ఇటువంటి ఏర్పాటే ఉంది. ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇటువంటి కార్యక్రమాలను అమలుపరుస్తున్నాయి. ఆంగ్లం, గణితశాస్త్ర బోధనల్లో మెరుగైన ఫలితాలు సమకూరినట్టు అధికారవర్గాలు ధ్రువీకరించాయి. ఒడిషాలో ఇటువంటి కార్యక్రమం అమలు ఫలితంగా ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల శాతం 64 నుంచి 75 శాతానికి పెరిగింది. ఉపాధ్యాయులు బోధించడానికి ఉత్సాహం చూపిన పక్షంలో నేర్చుకోవడానికి విద్యార్థులు సదా సంసిద్ధంగా ఉంటారనే విషయం ఈ అనుభవాల ద్వారా ధ్రువపడింది. మరి ఉపాధ్యాయులు తమకు సరైన వేతన భత్యాలు అందిన పక్షంలో విద్యార్థులకు మరింత మెరుగ్గా బోధించే విషయమై శ్రద్ధ చూపుతారని కూడా స్పష్టమయింది. మన దేశంలో ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సగటు వేతనం రూ.6000 మించడం లేదు. అయితే రూ.60,000 నెలసరి వేతనం అందుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల కంటే ప్రైవేట్ ఉపాధ్యాయులే తమ విధులను ప్రశస్తంగా నిర్వహిస్తున్నారు. కనుకనే ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్ పాఠశాలలే విద్యార్థుల ఉత్తీర్ణతలో మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. మన విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచాలంటే విద్యా మంత్రిత్వ శాఖకు బడ్జెట్ కేటాయింపులలో పెనుమార్పులు జరగాలి. ప్రభుత్వ పాఠశాలలకు చేస్తున్న కేటాయింపులను సగానికి తగ్గించాలి. మిగతా సగాన్ని విద్యార్థి ఎంచుకున్న పాఠశాలలకు చెల్లించాలి. ఇలా జరిగినప్పుడు ఉపాధ్యాయులు తమ బోధనా విధులపై అమిత శ్రద్ధ చూపుతారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చూపితే విద్యార్థి ద్వారా లభించే సగం చెల్లింపులు వారికి సమకూరవు. 'సంక్షేమ రాజ్య వ్యవస్థ'ను నిర్మించాలని మన రాజ్యాంగం నిర్దేశిస్తోంది. రేపటి పౌరులను సుశిక్షిత నిపుణులుగా తీర్చిదిద్దగల విద్యావ్యవస్థతోనే ఇది సాధ్యం. ఉపాధ్యాయుల సంక్షేమం కంటే విద్యార్థి శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చినప్పుడు మాత్రమే అటువంటి ఆదర్శ విద్యావ్యవస్థ విలసిల్లుతుంది. రాజ్యాంగ నిర్దేశం నెరవేరుతుంది. ఇది నిజమయినప్పుడు ప్రపంచానికి సామాన్య నిపుణులైన వెల్డర్లను మాత్రమే కాకుండా అధునాతన ప్రతిభాపాటవాల సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్లను కూడా ప్రపంచానికి పెద్ద సంఖ్యలో మనమే సమకూర్చగలుగుతాం.

## కలసి రండి...

మన నేల మన చెమట
పోరాడుతున్న వేళ
ఉనికి కోసం భవిత కోసం
ఉద్యమానికి ఊపిర్లందిస్తున్న
భారత భాగ్యవిధాతలు..
తరతరాల ఈ దేశ చరితలో
ఇదో మహోజ్జ్వల ఘట్టం!
రాజ్యమే మన పీక కోసే
చట్టాల కత్తి నూరుతుంటే
మన వ్యవసాయం
మన పంట
మనమే కొత్తగా జేబుకి చిల్లు
పెట్టుకొని మరీ కడుపు
నింపుకోవాల్సిన అగత్యం..
ముఖమల్ ముసుగులో
ధృతరాష్ట్ర కౌగిలిలా
వికాటాట్టహాసం చేస్తుంటే
ఆ చట్టాల పద్మవ్యూహాల్ని
తుత్తునియలు చేద్దాం..
ఉద్యమం ఊపు తగ్గకుండా
అన్నదాతల వెన్ను కాచి
నిజానిజాలు కుండ బద్దలు
కొడదాం రండి.

## అన్నం పెట్టే రైతు

అన్నం పెట్టే రైతు
దండం పెడుతున్నాడు
దళారులనుజి
పిండం పెట్టొద్దని
ఏరువాక కోసం
ఎదురు చూపు
ఈ సారైనా
పట్టెడన్నం పెట్టమని
దిన దిన గండం
నూరేళ్ళు ఆయుష్షు
రైతు మోములో
ఎప్పుడు ఉషస్సు ?
రైతు కన్నీరు ఆవిరై
ఎదురు చూపు
మేఘాలుగాజి
వర్షిస్తాయేమోనని
వానపాటకుజి
మేఘాలు ఆనవాలు
రైతు బ్రతుకు బాటకు
కన్నీరు చేవ్రాలు
ప్రకృతి వికృతి ఐతే
పైరు ఎండె
అది చూసి
ఆగె రైతు గుండె.

# మెజారిటీవాదం... అప్పుడూ ఇప్పుడూ..!

రాష్ట్రీయ స్వయంసేవక్ గురించి మహాత్మాగాంధీ 1947 ద్వితీయార్థంలో వ్యక్తం చేసిన అభిప్రాయం అప్పుడు ఎంత యథార్థమో ఇప్పుడూ అంతే నిర్దుష్టమైనది.పూర్తిగా కలవరం కలిగించేది అని కూడా చెప్పి తీరాలి. అధికారం అంచున ఉన్నా లేక అధికారం నెరపుతున్నా ఆరెస్సెస్ సదా సంపూర్ణాధికార దృక్పథంతో వ్యవహరించే ఒక మతతత్వ సంస్థ. అది, అంతకంటే తక్కువా కాదు, ఎక్కువా కాదు. స్వాతంత్ర్య వేకువ, దేశ విభజన దౌర్భాగ్యం, శరణార్థుల వెల్లువ%--% ఈ అల్లకల్లోల పరిస్థితుల్లో భారత్‌కు ఒక అంతర్గత శత్రువు నుంచి తీవ్ర ముప్పు వాటిల్లింది. హిందూ మత దురహంకారమే ఆ దురవస్థ. ఈ సంకుచిత జాత్యభిమాన ప్రేరణతో పనిచేస్తున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) హిందూ మధ్యతరగతి ప్రజల మద్దతును గణనీయంగా గెలుచుకున్నది. హిందూ మతస్థులైన పలువురు ప్రభుత్వోద్యోగులు, రాజకీయవేత్తలు ఆ సంస్థకు అనుయాయులయ్యారు. కాంగ్రెస్‌వాదుల రహస్య సానుభూతిని సైతం సంఘ్ చూరగొన్నదని గాంధీజీ చివరి కార్యదర్శి ప్యారేలాల్ తన 'మహాత్మా గాంధీ: ది లాస్ట్ ఫేజ్'లో రాశారు. 'సంఘ్ ఒక మతతత్వ, ఫాసిస్టు సంస్థ. హిందూరాజ్‌ను ఏర్పాటు చేయడమే దాని ప్రకటిత లక్ష్యం. ముస్లింలందరినీ భారత్ నుంచి పంపించివేయాలి అనేది దాని నినాదం'. అని కూడ ఆయన రాశారు. సంఘ్ లక్ష్యాన్ని ఇద్దరు అసాధారణ హిందువులు దృఢసంకల్పంతో వ్యతిరేకించారు. భారత్‌ను మాతృభూమిగా గౌరవించి, ఈ దేశంలోనే ఉండిపోయిన ముస్లింల హక్కులను సంరక్షించడం కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టేందుకు ఆ ఇరువురూ వెనుకాడలేదు. ఈ మహోన్నత, స్ఫూర్తిదాయక హిందువులు మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ అని మరి చెప్పాలా? 1947 ద్వితీయార్థంలో భారత రాజకీయాలలోనూ, ప్రజా జీవనంలోనూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పేరు ప్రఖ్యాతులు ఉన్న సంస్థ కాదు. దేశ విభజన నేపథ్యంలో నెలకొన్న మతతత్వ ఉద్రిక్తతలను ఉపయోగించుకుని తన పలుకుబడిని, ప్రభావాన్ని పెంపొందించుకునేందుకు సంఘ్ ఆరాటపడింది. అయితే గాంధీ, నెహ్రూల దృఢసంకల్పం సంఘ్ ఉత్థానాన్ని నిరోధించింది. ఒక హిందూ పాకిస్థాన్‌గా భారత్‌ను రూపొందించే సంకల్పం భారత ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ లేదని ప్రధాని నెహ్రూ విస్పష్టంగా ప్రకటించారు. గాంధీ తన నిరశన దీక్షలతో కలకత్తా, ఢిల్లీ నగరాలలో మతసామరస్యాన్ని నెలకొల్పడంలో సఫలమయ్యారు. 1948 జనవరి 30న గాంధీజీని సంఘ్ వాది ఒకడు హతమార్చాడు. మహాత్ముని బలిదానం హిందువులను భీతావహులను చేసింది. అంతకు మించి లజ్జాభరితుల్ని చేసింది. పశ్చాత్తాపం వారిని ఆవహించింది. ప్రతి హిందువులో మానవతా వివేకం మళ్ళీ ఉదయించింది. మతసామరస్యం తమ విధ్యుక్తధర్మమని గుర్తించారు. ఆ ఆదర్శాన్ని ఔదలదాల్చారు. ఆరెస్సెస్ కుటిల లక్ష్యాలు భగ్నమయ్యాయి-అప్పటికి. ఇది రాస్తున్న సమయంలో ఆరెస్సెస్ ఇంకెంత మాత్రం అప్రధాన సంస్థ కాదు. భారత రాజకీయాలు, ప్రజా జీవితంపై సంపూర్ణ ఆధిపత్యం నెరపుతున్న సంస్థ. దాని రాజకీయ విభాగమైన భారతీయ జనతాపార్టీ కేంద్రంలోనూ, పలు రాష్ట్రాలలోనూ అధికారంలో ఉంది. హిందూ మధ్యతరగతి ప్రజలలో చాలా మంది రహస్యంగా గాక, బహిరంగంగానే సంఘ్‌కు తీవ్ర మద్దతుదారులుగా ఉన్నారు. ఆ సంస్థ రాజకీయ, భావజాల ఎజెండాను పూర్తిగా సమర్థిస్తున్నారు. 1947లో ఆరెస్సెస్ మౌలిక విశ్వాసాలు ఏమిటి? ఇంతకు ముందు ప్రస్తావించిన ప్యారేలాల్ మాటలను మళ్ళీ ఉటంకిస్తాను: 'హిందూరాజ్‌ను ఏర్పాటుచేయడం సంఘ్‌వాదుల ప్రకటిత లక్ష్యం. ముస్లింలు అందరినీ భారత్ నుంచి పంపించివేయాలి అనేది వారి నినాదం'. ఈ ప్రకటనలోని మొదటి భాగం ఇప్పటికీ పూర్తిగా చెల్లుతుంది. రెండో భాగాన్ని సవరించారు. దేశ విభజన సంభవించిన తక్షణ రోజుల్లో సంఘ్ నాయకులు చాలామంది ముస్లింలు అందరినీ భారత్ నుంచి తరిమేయాలని కోరుకున్నారు. అయితే అది సాధ్యం కాబోదనే సత్యం 1950 దశకం తొలినాళ్ళకే వారికి అవగతమయింది. సరే, ఇప్పుడు భారతీయ ముస్లింల పట్ల సంఘ్ దృక్పథంలో కొంత మార్పు వచ్చింది. భారత్‌లో జన్మించి, ఈ దేశంలో నివశిస్తున్నవారు ఇక్కడే ఉండిపోవచ్చు. అయితే హిందువుల రాజకీయ, సామాజిక, ఆర్థిక, నైతిక ఆధిక్యతను గుర్తించి, గౌరవిస్తున్నంతవరకు ముస్లింలు ఈ దేశంలో నివశించేందుకు ఎటువంటి అభ్యంతరం లేదు అనేది ప్రస్తుతం ఆరెస్సెస్ రాజకీయ ఎజెండా. మధ్యయుగాల ఇస్లాం నుంచి ఆ ఎజెండాను సంఘ్ స్వీకరించింది! ఇదొక చారిత్రక వైపరీత్యం. ఇస్లామిక్ సామ్రాజ్యాలు ఉచ్ఛదశలో ఉన్న ఆ కాలంలో ముస్లింలకు యూదులు, క్రైస్తవులకంటే మేలైన హక్కులు ఉండేవి. అంతటా ముస్లింలదే ఆధిక్యత. వారే అసలు పౌరులు. సర్వహక్కులూ వారికే. ముస్లిమేతర మతస్థులు ఇస్లాం ఆధిపత్యాన్ని ఆమోదించి తీరాలి. ముస్లింల కంటే తాము తక్కువ వారమని అంగీకరించి తీరాలి. ద్వితీయశ్రేణి పౌరులుగా మనుగడ సాగించాలి. ఇలా చేసినప్పుడు మాత్రమే ముస్లిం సమాజాలలో వారికి, వారి కుటుంబాలకు రక్షణ ఉంటుంది. ఉపాధి అవకాశాలు పొందవచ్చు. మధ్యయుగాల ముస్లిం సామ్రాజ్యాలలో ఆచరణలో ఉన్న వివక్షాపూరిత విధానాలు వర్తమాన భారతదేశంలో కూడా అమలుకావడమే ఆరెస్సెస్ అభీష్టం. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చరిత్ర, సామాజిక, సాంస్కృతిక కార్యాచరణలపై విస్తృత అధ్యయనాలు జరిగాయి. పలు పరిశోధనా గ్రంథాలు వెలువడ్డాయి సంఘ్ సైతం తన లక్ష్యాలు, కార్యక్రమాల గురించి సవివరమైన పుస్తకాలు, కరపత్రాలను వెలువరించింది. ఈ సమాచారం మరింత విపులంగా ఎప్పటికప్పుడు సంఘ్ సభ్యులకూ, సభ్యులు కానివారికీ అందుబాటులోకి వస్తోంది. హిందూ స్వాభిమానాన్ని పునరుజ్జీవింప చేసేందుకు తాము అంకితమయ్యామని ఆరెస్సెస్ చెబుతోంది. అయితే ఆ సంస్థ, దాని అనుబంధ రాజకీయపక్ష విశ్వాసాలు, కార్యాచరణలు స్వభావతః దురభిమానపూర్వక ధోరణులతో ప్రభావితమవుతున్నాయి. కేంద్రప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్రప్రభుత్వాల ఇటీవలి చర్యలను పరిగణనలోకి తీసుకోండి. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి రద్దు, అయోధ్యలో ఒక ఆలయ నిర్మాణంపై విజయోత్సాహం, అంతర్-మత వివాహాలకు వ్యతిరేకంగా చట్టాల నిర్మాణం, మరీ ముఖ్యంగా పౌరసత్వ సవరణ చట్టం, ఆ శాసనాన్ని వ్యతిరేకిస్తున్న వారిపై పాశవిక దమనకాండ -ఇవన్నీ భారతీయ సమాజంలో ముస్లింలకు వారి స్థానం ఏమిటో చూపేందుకు చేపట్టిన చర్యలేగా. 1947 సెప్టెంబర్‌లో ఢిల్లీలో తాను ప్రత్యక్షంగా విన్న ఒక సంభాషణ గురించి ప్యారేలాల్ తన పుస్తకంలో పేర్కొన్నారు. వాహ్ శరణార్థుల శిబిరంలో ఆరెస్సెస్ కార్యకర్తలు నిర్వహించిన సేవా కార్యక్రమాల గురించి గాంధీజీ బృందంలోని ఒకరు చాలా మెచ్చుకోలుగా చెప్పారు. క్రమశిక్షణతో చాలా కష్టపడి పని చేశారని కూడ ఆయన అన్నారు. తన సహచరుడి మాటలకు గాంధీజీ ప్రతిస్పందిస్తూ 'మీరు ఒక వాస్తవాన్ని మరచిపోవద్దు. హిట్లర్ నాజీలు, ముస్సోలినీ ఫాసిస్టులు కూడా అత్యంత క్రమశిక్షణాపరులు. ఎటువంటి కష్టమైన పనినైనా చేయగల సమర్థులే' అన్నారు. పైగా 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సంపూర్ణాధికార దృక్పథం గల ఒక మతతత్వ సంస్థ' అంటూ సమాధానాన్ని ముక్తాయించారని ప్యారేలాల్ వివరించారు. 72 సంవత్సరాల క్రితం ఆరెస్సెస్




గురించి గాంధీజీ వ్యక్తం చేసిన అభిప్రాయం ఇప్పటికీ నిలుస్తుందా అంటే, నిలుస్తుంది. కాకపోతే ఆయన ఉపయోగించిన విశేషణాలను ఇటు అటుగా, అటు ఇటుగా మార్చవలసిఉంది. ఇప్పుడు ఆరెస్సెస్ గురించి, 'మతతత్వ దృక్పథంతో వ్యవహరించే ఒక సంపూర్ణాధికార సంస్థ' అనడం సబబుగా ఉంటుంది. 1947లో ఆరెస్సెస్ భారతీయ సమాజ జీవనం అంచుల్లో మాత్రమే ఉంది. ఇప్పుడు అది సకల భారతీయ జీవన రంగాలన్నిటినీ ఇతోధికంగా ప్రభావితం చేస్తోంది. కేంద్రప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న సంఘ్ సభ్యులు పత్రికారంగాన్ని లోబరుచుకున్నారు, న్యాయవ్యవస్థను ఇంచుమించు సానుకూలం చేసుకున్నారు. ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రభుత్వాలను బలహీనపరిచేందుకు లేదా కూలదోసేందుకు ధనబలాన్ని ఉపయోగిస్తున్నారు. ఎన్‌జిఓలపై ఆంక్షలు విధించేందుకు తీసుకువచ్చిన కొత్త చట్టాల లక్ష్యం హిందూత్వ భావజాలంతో ఏకీభవించని స్వచ్ఛందసంస్థలను అణచివేయడమే. రాజకీయప్రక్రియలు, రాజ్యాంగసంస్థలు, వ్యవస్థలపై పూర్తి ప్రాబల్యాన్ని సాధించేందుకు ఆరెస్సెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయి. పౌర సమాజాన్ని పూర్తిగా తమ నియంత్రణలో ఉంచుకునేందుకు అవి ఆరాటపడుతున్నాయి. ప్రజలు ఏమి తినాలో, వారి వస్త్రధారణ ఎలా ఉండాలో, ఎవరిని వివాహం చేసుకోవాలో లేదా చేసుకోకూడదో నిర్దేశిస్తున్నాయి. ప్రజాజీవితపు రాజకీయ, సామాజిక, సంస్థాగత లేదా సైద్ధాంతిక పార్శ్వాలన్నిటిపైన ఎటువంటి మినహాయింపులు లేని నియంత్రణ సాధించడమనే ఆకాంక్ష 'నియంతృత్వవాద లేదా సంపూర్ణాధికార' దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నది. ముస్లింలపై అపవాదులు వేసేందుకు లేదా వారు దేశభక్తులు కాదని చెప్పేందుకు సంఘ్ అనుయాయులు చేస్తున్న ప్రయత్నాలు వారి మతతత్వ దృక్పథానికి దృష్టాంతాలు. రాష్ట్రీయ స్వయంసేవక్ గురించి మహాత్మా గాంధీ 1947 ద్వితీయార్థంలో వ్యక్తం చేసిన అభిప్రాయం అప్పుడు ఎంత యథార్థమో ఇప్పుడూ అంతే నిర్దుష్టమైనది. పూర్తిగా కలవరం కలిగించేది అని కూడా చెప్పి తీరాలి. అధికారం అంచున ఉన్నా లేక అధికారం నెరపుతున్నా ఆరెస్సెస్ సదా సంపూర్ణాధికార దృక్పథంతో వ్యవహరించే ఒక మతతత్వ సంస్థ. అది, అంత కంటే తక్కువా కాదు, ఎక్కువా కాదు.

## అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన) : అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ కోరారు. తెలంగాణ ప్రభుత్వం కళ్యాణలక్ష్మీ పథకం ద్వారా 10 మంది లబ్దిదారులకు మంజూరు చేసిన రూ.10,01,160 విలువ చేసే చెక్కులను ఆదివారం సూరారం డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్, నెహ్రూనగర్, మార్కండేయనగర్, రాజీవ్‌గాంధీనగర్‌లలో ఆయనతో పాటు స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణలు పాల్గొని ఇంటింటికి తిరిగి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కెసిఆర్ పేదింటి ఆడపడుచుల వివాహాలకు పెద్దన్నగా మారి కళ్యాణలక్ష్మీ చెక్కులు అందిస్తూ కొండంత అండగా నిలుస్తున్నారన్నారు. ఆడపడుచుల వివాహం చేయాలంటే పేదరికం వల్ల అప్పు చేయాల్సిన పరిస్థితులను టిఆర్ఎస్ ప్రభుత్వం తొలగించిందన్నారు. పేదింటి ఆడపడుచుల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకుడదనే లక్ష్యంతో సీఎం కెసిఆర్ కళ్యాణ లక్ష్మీ పథకం ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, వార్డు కమిటీ సభ్యులు సిద్దిక్, నేతిరాజా, నాయకులు నాగిళ్ళ శ్రీనివాస్, ఫేరోజ్, శ్రీను, అఖిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ల అభ్యున్నతికి టిఆర్ఎస్ ప్రభుత్వం కృషి

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**




కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలోని హొసన్న చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ఆదివారం నిర్వహించిన వేడుకలకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణలు హజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్టియన్ల అభ్యున్నతికి టిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, వార్డు సభ్యులు సిద్దిక్, నాయకులు నాగిళ్ళ శ్రీనివాస్, ఫెరోజ్, శ్రీకాంత్, పాస్టర్లు సుదీర్ వర్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

## సుందర్‌నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సుందర్‌నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఇన్నారెడ్డి, ఉపాధ్యక్షులుగా అల్వాల్ రెడ్డి, కార్యదర్శిగా రామిరెడ్డి, సభ్యులు బాలస్వామి, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత సురేష్‌రెడ్డి హాజరై సుందర్‌నగర్ ఇండెక్స్ బోర్డును ప్రారంభించి నూతన కమిటీ లెటర్ ప్యాడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీని అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు.



జగద్గిరిగుట్ట సిఐగా సైదులు ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం టిఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందిరాగౌడ్, శంకర్, రాజేష్, వినోద్, సాయిలు, అంజి, విఘ్నేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన) :

# విశాఖ భూములపై సిట్ నివేదిక సిద్ధం : విజయసాయి



**విశాఖ, డిసెంబర్ 20 (ప్రజాపాలన) :** ప్రభుత్వ భూములు ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ భూమి అంటే ప్రజల భూమి అని.. ప్రజాస్వామ్యంలో అందరూ సమానమేనన్నారు. ఈ విషయంలో తెదేపా నేతలు తప్పుడు ప్రచారాలు చేయవద్దన్నారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విశాఖ జిల్లాలో బాక్సైట్ తవ్వకాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఒడిశా నుంచి బాక్సైట్ తెచ్చి అన్‌రాక్ పరిశ్రమ నడిపే యోచనలో ఉన్నామని.. దీని వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. విశాఖ భూములపై సిట్ నివేదిక సిద్ధమైందని.. త్వరలోనే అధికారులు ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. పరిపాలన రాజధాని విశాఖలో ప్రభుత్వ భూమిలోనే కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని విజయసాయిరెడ్డి వివరించారు.

# సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, జంతు జూ పార్క్‌ని ఏర్పాటు చేయాలి

## ముఖ్యమంత్రిని కోరిన సామాజిక కార్యకర్త మెటికల శ్రీనివాసరావు




**జగ్గయ్యపేట - (ప్రజాపాలన) :** రాష్ట్ర అభివృద్ధి పథంలో నడుపుతున్న గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి జగ్గయ్యపేట నియోజకవర్గాన్నికి విచ్చేయుచున్న సంధర్భంగా ప్రజలందరు సంతోషిస్తున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్ళగలరని ప్రజల తరుపున సామాజిక కార్యకర్త మెటికల శ్రీనివాసరావు ప్రభుత్వ విప్,స్థానిక శాసన సభ్యులు సామినేని ఉదయ భానుకి సామాజిక మాధ్యమాల, పత్రికా ద్వారా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మ్మెహన్ రెడ్డికి విజ్ఞాపనని తెలియజేయుచున్నాము. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త మెటికల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానంగా జగ్గయ్యపేట ప్రాంతంలో పలు కర్మాగారాల వల్ల ప్రభుత్వ నిభందనలు సక్రమంగా పాటించడం లేదనే ప్రజల వాదనలతో గాలి,నీరు కాలుష్యం అయ్యాయని, స్థానిక కర్మాగారాలలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కూడా తక్కువే అని పలువురు వాదిస్తున్నారు. జగ్గయ్యపేట ప్రాంతంలో కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలని,స్థానికులకు ఉద్యోగ అవకాశాలలో ప్రాధాన్యత కల్పించాలని, కృష్ణానదిపై వాహనాల రవాణా కోసం ఫ్లైఓవర్ అవుటర్ రింగ్ రోడ్డును ఏర్పాటు చేయాలని, హైదరాబాదు విజయవాడ మధ్య ప్రాంతంగా జగ్గయ్యపేట ప్రాంతం ఉండటం మూలానా జగ్గయ్యపేట పట్టణంలో రైల్వే జంక్షన్ ని ఏర్పాటు చేయాలని,రైల్వే రవాణా ఏర్పాటు చేసి గుంటూరు కి రైల్వే లైన్ ని కలపాలని,జగ్గయ్యపేట ప్రాంతంలో ప్రధానంగా టూరిజం డెవలప్ చేయడానికి కృష్ణా నదిలో బోటు షికారు ఏర్పాటు చేయాలని,ఈ ప్రాంతంలో 15,000 ఎకరాలకు పైబడి ప్రభుత్వ అటవీ భూమి ఉండటంతో రిజర్వ్ ఫారెస్ట్ గా మార్చి జంతువు జూ పార్క్ ని ఏర్పాటు చేయాలని,బుద్ధుడు నడయాడిన ఈ ప్రాంతంలో ధనంబోడుపై బౌద్ధ స్థూపాన్ని ఏర్పాటు చేసి టూరిజం హబ్గా జగ్గయ్యపేట ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని,జగ్గయ్యపేట ప్రాంతాన్ని రెవెన్యూ డివిజనల్ పరిధిలోకి తీసుకురావాలని,ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ని,ప్రభుత్వ వైద్య కళాశాలను మరియు పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని,ఈ ప్రాంతంలో ప్రభుత్వస్థలాలుఎక్కువగాఉండటం మూలాన ప్రభుత్వ యూనివర్సిటీ ని కూడా ఏర్పాటు చేయాలని,పాలిటెక్నిక్ కాలేజిని,ఈ ఎస్ ఐ డిస్పెన్సరీ హాస్పిటల్ ని ఏర్పాటు చేయాలని ఆయన తెలియజేశారు. పాడైన రోడ్లను పూర్తి స్థాయిలో తొలగించి నూతనంగా ఏర్పాటు చేయాలని, లింగాల మన్నేరు, అగ్రహారం పాలేరు బ్రిడ్జీల ఎత్తు లేపి నూతనంగా ఏర్పాటు చేయాలని, ఎండ్ల తరబడి రిజిస్ట్రేషన్లు కొనసాగుతూ చేతులు మారిన ఎండోమెంట్ భూముల రిజిస్ట్రేషన్ ని కొనసాగించాలని,ప్రభుత్వం నేటి వరకు ఇచ్చిన ఇండ్ల స్థలాల ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, ప్యాసింజర్ ట్రైన్ ని జగ్గయ్యపేట వరకు నడపాలని,ట్రామా కేర్, 100 పడకల హాస్పిటల్ గా జగ్గయ్యపేట పట్టణ ప్రభుత్వ హాస్పిటల్‌ని అభివృద్ధి చేయాలని, జగ్గయ్యపేట ఆర్.టి.సి బస్టాండులోకి దూర ప్రాంతలకి వెళ్ళే విజయవాడ డిపో నుండి నడిచే గరుడ బస్సులకు స్టాప్ ఏర్పాటు చేయాలని, కబ్జా ల సమస్యలతో ఫిర్యాదులు వస్తున్న వాటిని వెంటనే పరిష్కరించాలని ప్రజల తరుపున కోరుతున్నాను. ఇప్పటికే గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మ్మెహన్ రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ విప్,స్థానిక శాసన సభ్యులు సామినేని ఉదయ భాను కృషి వల్ల జగ్గయ్యపేట పట్టణ ప్రాంతానికి కృష్ణా నదీ జలాలు త్రాగు నీరుగా అందించి ప్రజల మనస్సులో చరగని ముద్రను వేసుకున్నందుకు ప్రజలు సంతోషిస్తున్నారు. పై తెలిపిన ప్రజల కోరుకుంటున్న కోరికలను గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మ్మెహన్ రెడ్డి పరిశీలించి,జగ్గయ్యపేట ప్రాంత అభివృద్ధికి మరింత కృషి చేస్తారని ప్రజల తరుపున సామాజిక కార్యకర్త మెటికల శ్రీనివాసరావు సామాజిక మాధ్యమాల ద్వారా సియం గారిని కోరుతున్నారు.

# రాష్ట్రంలో బీసీ, ఎస్సి, ఎస్టిలపై దాడులు..

## వడ్డెర కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ దేవళ్ళ మురళి




**నరసరావుపేట, ప్రజాపాలన :** రాష్ట్రంలో వైకాపా అధికారం చేపట్టాక బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయని వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల మురళి మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేస్తారని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు. బీసీ కులాల ను విభజించి 139 కులాలుగా చేసి 56 కార్పొరేషన్ల ద్వారా ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. తేదేపా అధికారంలో ఉండగా 16 వేల కోట్లు లోటు బడ్జెట్ వున్నప్పటికీ బీసీలకు పెద్ద పీట వేసిందన్నారు. ఎస్సీ ఎస్టీ కాపు వైశ్య బ్రాహ్మణ కార్పొరేషన్ లకు రూపాయల నిధులు ఇచ్చి ఆదుకున్నారు. మాట తప్పను మడమ తిప్పను అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకుండా చైర్మన్ లను డైరెక్టర్లను నియమించి చేతులు దులుపుకొన్నారన్నారు. 151 మంది వైకాపా ఎమ్మెల్యేలు ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి మెప్పు కోసం అవమానకరంగా మాట్లాడటం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. కొడాలి నాని మాట తీరు మార్చు కోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని చంద్రబాబు నాయుడిని విమర్శించే స్థాయి వైకాపా లో ఉన్న మంత్రులు ఎమ్మెల్యేలకు లేదన్నారు. ఓటమి భయంతోనే వైకాపా స్థానిక ఎన్నికలను అడ్డుకుంటుందని ప్రజా సంక్షేమం పట్ల పాలన పట్ల అవహగన అనుభవం లేని ముఖ్య మంత్రిని రాష్ట్ర ప్రజలు తిరస్కరిం చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నరసరావుపేటలో తేదేపా బలోపేతానికి డాక్టర్ చదలవాడ అరవింద బాబు నాయకత్వంలో బీసీలు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తేదేపా పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు శేఖర్, టిడిపి సీనియర్ నాయకులు వల్లెపు నాగేశ్వరరావు, పెరికల రాయప్ప, యాడ్స్ వలి, కరీముల్ల తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పుట్టినరోజును ఘనంగా నిర్వహించాలి



**చీరాల (ప్రజాపాలన) :** డిసెంబర్ 21న ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా చీరాలలో మాజీ శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు చీరాల వైసీపీ నాయకులు ఇక్కడ మీడియాకు తెలియజేశారు. కార్యక్రమానికి మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి , ఎంపీ నందిగం సురేష్ ముఖ్యఅతిధులుగా వస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 21న ఉదయం 10 గంటలకు యన్.ఆర్.పి.యమ్ హైస్కూల్ నందు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రక్తదానం కార్యక్రమం పూర్తయిన వెంటనే ఆమంచి ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సెమీ క్రిస్టమస్ ని 16వ ఏట నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి అందరూ తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసింది నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బోనిగల పేతురుబాబు, యాతం మేరిబాబు,శీలం శ్యామ్,కోటి దాసు,,సల్లూరి సత్యానందం, దాసరి శ్రీకాంత్, పాపిశెట్టి సురేష్,మేరుగ ఇస్సాకు తదితర నాయకులు పాల్గొన్నారు.

# దేశమంతా రైతుల పక్షానే.. ఎందరిపై దాడి చేస్తారు?



**న్యూఢిల్లీ, డిసెంబర్ 20 (ప్రజాపాలన) :** నూతన వ్యవసాయ చట్టాల రద్దు కోసం ఆందోళన చేస్తున్న రైతుల పక్షాన దేశ ప్రజలంతా నిలబడినప్పుడు ఎంతమందిపై కేంద్రం దాడులు చేయించగలదని దిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. రైతుల ఆందోళనకు మద్దతుగా నిలుస్తున్న పంజాబ్‌లోని కమీషన్ ఏజెంట్లకు (అర్తియాలు) ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో కేజ్రీవాల్ ఈ విధంగా స్పందించారు. "రైతులు చేస్తున్న పోరాటానికి అండగా ఉన్న వ్యాపారులపై కేంద్ర ప్రభుత్వం ఐటీ దాడులు చేయిస్తోంది. ఇలాంటి వ్యాపారులను వేధించడం తప్పు. రైతు ఉద్యమాన్ని పూర్తిగా బలహీన పరిచేందుకే ఇవన్నీ చేస్తున్నారు. ఈ రోజు దేశమంతా రైతులతోనే ఉంది. కేంద్రం ఎవరిపైన దాడి చేయిస్తుంది?" అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఈ మేరకు ఐటీ నోటీసులకు సంబంధించిన వార్త క్లిప్పింగ్‌ను జత చేశారు. పంజాబ్‌లో గత నాలుగు రోజుల్లో సుమారు 14 మంది అర్తియాలకు ఐటీ శాఖ నోటీసులు జారీ అయ్యాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ అన్నారు. వారిపై ఒత్తిడి తెచ్చి రైతు ఉద్యమాన్ని కేంద్రం అణచివేయాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ మరుసటి రోజే కేజ్రీవాల్ ఈ విధంగా కేంద్రంపై విరుచుకుపడ్డారు.

## మండలంలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం

**చీరాల (ప్రజా పాలన) :** చీరాల మండలం గవినివారి పాలెం, కావూరివారి పాలెం ,దేవి నూతల గ్రామాలలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అసిస్టెంట్ ఇంజినీర్ రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పనుల మెయింటెన్స్ నిమిత్తం సరఫరాను నిలిపి వేస్తున్నామని చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని రాంబాబు కోరారు.

## దివిస్ బాధితులకు జనసేన అండగా ఉంటుంది: నాదెండ్ల మనోహర్

**అమరావతి, డిసెంబర్ 20 (ప్రజాపాలన) :** దివిస్ బాధితులకు జనసేన అండగా ఉంటుందని జనసేన నేత నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. 10 రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే బాధితులను తమ అధినేత పవన్ కలుస్తారని తెలిపారు. నాడు దివీస్ ప్రాంతంలో జగన్ పర్యటించి ఊదరగొట్టారని, జగన్ సీఎం అయ్యాక హామీలన్నీ మరిచారని నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలంలో దివిస్ యూనిట్ ఏర్పాటును రైతులు వ్యతిరేకిస్తున్నారు. దివిస్ ఏర్పాటైతే రోజూ 55 లక్షల లీటర్ల కలుషిత నీరు సముద్రంలో కలుస్తుందని, మత్స్యసంపద నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తీరప్రాంత గ్రామాల్లో నివాసితుల జీవనోపాధి దెబ్బతినే అవకాశం ఉన్నందున తొండంగిలో యూనిట్ ఏర్పాటు చేయవద్దని రైతులు ఆందోళన చేస్తున్నారు.





# రాష్ట్రంలో విద్యుత్ పొదుపు ద్వారా వేలకోట్ల విద్యుత్ ఖర్చు తగ్గించ వచ్చును

## -యన్. జి. ఓ ప్రెసిడెంట్ ఆర్. కె. దుర్గ పద్మజ

**నరసరావుపేట, ప్రజాపాలన :** జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈరోజు తో ముగిసిన సందర్భంగా స్థానిక యన్. జి. ఓ సంస్థ ప్రెసిడెంట్ ఆర్. కె. దుర్గ పద్మజ ఈ రోజు స్థానిక రావిపాడు రోడ్డులో గల కృష్ణ చైతన్య జూనియర్ కాలేజ్ హాస్టల్ ప్రాగణంలో విద్యార్థిని విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది అని తెలుపుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల వివరాలు తెలిపారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి నేతృత్వంలో విద్యుత్ శాఖ రాష్ట్ర ప్రజలకు అంతరాయం లేని విద్యుత్ ఇవ్వడం జరుగుతుంది అని, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ చైర్మన్ గా ఉండే రాష్ట్ర విద్యుత్ పొదుపు కమిటీ సి. ఈ. ఓ చంద్ర శేఖర రెడ్డి గారు విద్యుత్ పొదుపు పై ప్రజల్లో అవగాహన కోసం యన్. జి. ఓ సంస్థలు కూడా భాగస్వామ్యం చేయాలనుకున్న సందర్భంగా మా యొక్క యన్. జి.ఓ తరపు ఈ వారం రోజులు విస్తృతంగా ప్రజల్లో, విద్యార్థులలో, విద్యుత్ వాడకం దారుల్లో విద్యుత్ పొదుపు అవగాహన కలిపించటం జరిగింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో గృహసముదాయాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో హరిజన గిరిజ కాలనీల్లో యల్. ఈ. డి బల్బులు ద్వారా విద్యుత్ బిల్లులమొత్తం తగ్గించుకోవచ్చు అని, కరపత్రాలు పంపిణీ, స్టిక్కర్స్, గోడ పోస్టర్ ఏర్పాటు చేశాము అని, ఆడియో తో కూడిన ప్రచార రథం ద్వారా ప్రచారం చేయడం జరిగిందని, ఈ యొక్క విద్యుత్ పొదుపు వారోత్సవాలలో ప్రజా ప్రతినిధులను, విద్యుత్ అధికారుల భాగస్వామ్యం తో తమ యన్. జి. ఓ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది అని ప్రతి ఒక్క కార్యక్రమం సోషల్ మీడియా ఫేసుబుక్ ట్విట్టర్ వాట్సప్ గ్రూపుల్లో ఇన్స్టాగ్రామ్ ద్వారా, ప్రచారం మరియూ స్థానిక దినపత్రికలలో టెలివిజన్ ప్రసార మాధ్యమాల ద్వారా నేషనల్ ఎనర్జీ కన్సర్వేషన్ 2020 పై ప్రచారం చేయడం జరిగింది అని, రాష్ట్ర విద్యుత్ పొదుపు కమిటీల్లో యన్.జి.ఓ సంస్థల నుండి ఒకరికి నాన్ అఫిషియో సభ్యులు గా అవకాశం ఇవ్వాలని విద్యుత్ పొదుపు పై నిరంతరం ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించటము ద్వారానే రాష్ట్రంలో విద్యుత్ పొదుపు ద్వారా వేలకోట్ల విద్యుత్ ఖర్చు తగ్గించ వచ్చును అనితెలిపారు. యన్. జి. ఓ సంస్థ కి సహకారాన్ని అందించిన సెంట్రల్ పవర్ డీస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ చైర్మన్ మరియూ యమ్.డి పద్మా జనార్దన్ రెడ్డి గారికి యన్. జి. ఓ ప్రెసిడెంట్ ఆర్. కె. దుర్గ పద్మజ ధన్యవాదాలు తెలిపారు.

# కేంద్రం తెచ్చిన రైతు వ్యతిరేక బిల్లు రద్దు చేయాలి



**చేబ్రోలు, ప్రజాపాలన:** ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నారాకోడూరు కళ్యాణమండపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్ వేణుగోపాల రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు రైతు వ్యతిరేక బిల్లులను వెంటనే రద్దు చేయకపోతే రైతులు మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు రైతులు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా గత ఇరవై ఆరు రోజుల్లో చేస్తున్న పోరాటానికి రైతులు, ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు అండగా నిలవాలని కోరారు ఈ పోరాటంలో చనిపోయిన 36 మందికి నివాళులు అర్పించారు ఈ చట్టాల వల్ల బ్లాక్ మార్కెట్కు మార్గం సులభం అవుతుందని ఆయన అన్నారు కనీస మద్దతు ధర కల్పించకపోతే రైతుల జీవన మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఆయన అన్నారు సిఐటియు జిల్లా అధ్యక్షులు డి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మార్కెట్ యార్డు రద్దు చేస్తే రైతులు ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు కార్పొరేట్ సంస్థలకు కట్టు బెట్టే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణల వల్ల రాష్ట్రాల హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని, దీనివలన ధరలు పెరిగి భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు రైతు వ్యతిరేక బిల్లులను రద్దు చేయకపోతే రైతులు, వినియోగదారులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పల్లా ఈశ్వరరావు, జంపని తిరుపతిరావు, జాస్తి హనుమయ్య, వెళ్లగా చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు

# నేడు పందిళ్లపల్లిలోని హైస్కూలులో రక్తదానం కార్యక్రమం

వేటపాలెం(ఒంగోలు) : వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలలో, వాలంటీర్స్ అందరూ పాల్గొని జయప్రదం చెయ్యాలని, దేశాయిపేట వాలంటీర్ యం. దినేష్ తెలియజేసారు. ఈ సందర్భంగా వాలంటీర్ దినేష్ మాట్లాడుతూ, తొలుత జగన్మోహన్రెడ్డి పుట్టినరోజు సందర్భంగా, పందిళ్లపల్లిలోని హైస్కూలులో రక్తదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రక్తదానం కార్యక్రమానికి, ముఖ్య అతిథిగా చీరాల మాజీ శాసనసభ్యుడు, చీరాల వైఎస్సార్సిపి ఇంచార్జి ఆమంచి కృష్ణమోహన్ పాల్గొంటున్నారన్నారు. తర్వాత దేశాయిపేటలోని అనాధఆశ్రమంలో పండ్లు, స్వీట్లు పంపిణీ కార్యక్రమం జరుగునన్నారు. ఈ కార్యకమాన్ని వాలంటీర్స్ అందరూ పాల్గొని, ఈ కార్యక్రమాలను జయప్రదం చెయ్యాలని, దేశాయిపేట వాలంటీర్ యం.దినేష్ కోరారు.

# వాకర్స్ అసోసియేషన్ కమిటీ మీటింగ్



**చేబ్రోలు, ప్రజా పాలన :** మండల కేంద్రమైన చేబ్రోలు లో గల అగ్రిగోల్డ్ ఫ్లాట్ నందు వాకర్స్ అసోసియేషన్ కమిటీ మీటింగ్ ఆదివారం సాయంత్రం జరిగింది ఈ కార్యక్రమానికి అధ్యక్షులు గోవాడ మోహన్ రావు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకింగ్ రౌండ్ అభివృద్ధి నిమిత్తం సభ్యులు దగ్గర వసూలు చేసిన మొత్తం డబ్బులో నుంచి మిగిలిన 12 వేల రూపాయలు పార్కులో పైపులైన్ల విస్తరణ చేయుటకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ టి.సాంబశివరావు, ట్రెజరీ చౌడయ్య, చాణిక్య శివరామకృష్ణ, మెంబర్స్ ఏ.కొండల రావు, సిహెచ్.మాధవ్, ఉప్పల. ఉషారాణి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# విప్పర్ల, రెడ్డిపాలెం మోడల్ స్కూల్‌కు బస్సు సర్వీస్

**నరసరావుపేట, ప్రజాపాలన :** నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేట డిపో నుండి విప్పర్ల రెడ్డిపాలెం మోడల్ స్కూల్‌కు చాకలి కుంట నుండి బస్సు ఏర్పాటు చేయడమైనదని నరసరావుపేట డిపో మేనేజర్ అబ్దుల్ సలామ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఈ బస్సు యొక్క టైమింగ్స్ నరసరావుపేట నుండి ఉదయం 7 గంటలకు బయలుదేరి రావిపాడు మీదుగా నల్ల గార్లపాడు, మాచవరం, మర్రి చెట్టుపాలెం, విప్పర్ల రెడ్డి పాలెం, కొత్తపల్లి మీదుగా చాకలి గుంట 8:30 కు వెళ్లి



డిపో మేనేజర్ అబ్దుల్ సలామ్

విద్యార్థులను ఎక్కించుకొని తిరిగి 8:45 బయలుదేరి కొత్తపల్లి మీదుగా విప్పర్ల రెడ్డిపాలెం మోడల్ స్కూల్ కి వెళ్ళి విద్యార్థులను దింపి మర్రి చెట్టు పాలెం, మాచవరం, నల్ల గార్లపాడు, రావిపాడు మీదుగా నరసరావుపేట వచ్చును అలాగే మధ్యాహ్నం 13-00 గంటలకు నరసరావుపేటలో బయలుదేరి రావిపాడు మీదుగా నల్ల గార్లపాడు మాచవరం మర్రి చెట్టు పాలెం విప్పర్ల రెడ్డిపాలెం మోడల్ స్కూల్ వెళ్ళి విద్యార్థులను ఎక్కించుకొని కొత్తపల్లి మీదుగా చాకలి కుంట వెళ్ళి విద్యార్థులను దింపి తిరిగి కొత్తపల్లి మీదుగా విప్పర్ల రెడ్డిపాలెం మర్రి చెట్టు పాలెం మాచవరం నల్ల గార్లపాడు రావిపాడు మీదుగా నరసరావుపేట డిపో వచ్చును కావున ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మేనేజర్ అబ్దుల్ సలామ్ తెలిపారు.

# నేడు ఆమంచి ఆధ్వర్యంలో జగన్ పుట్టిన రోజు వేడుకలు



## ముఖ్యఅతిథులుగా మంత్రి బాలినేని, ఎంపీ నందిగం.సురేష్

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపు

**చీరాల(ఒంగోలు), డిసెంబర్ 20 (ప్రజాపాలన) :** ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా, డిసెంబర్ 21న చీరాలలో, మాజీ శాసనసభ్యులు ఆమంచి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో, పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు, చీరాల వైసీపీ నాయకులు మీడియాకు తెలియజేశారు. చీరాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, వైసిపి నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఏర్పాట్లపై చర్చించి, మీడియా వారికి వివరాలు తెలియజేశారు. కార్యక్రమానికి మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి , ఎంపీ నందిగం సురేష్ ముఖ్యఅతిధులుగా వస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 21న ఉదయం 10 గంటలకు యన్.ఆర్.పి.యమ్ హైస్కూల్ నందు, మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రక్తదానం కార్యక్రమం పూర్తయిన వెంటనే ఆమంచి ఆధ్వర్యంలో, గత 15సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సెమీక్రిస్టమస్‌ని 16వఏట నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి అందరూ తప్పకుండా హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసింది నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బోనిగలపేతురుబాబు, యాతం మేరిబాబు, శీలంశ్యామ్, కోటిదాసు, సల్లూరి.సత్యానందం, దాసరిశ్రీకాంత్, పాపిశెట్టిసురేష్, మేరుగ ఇస్సాకు తదితర నాయకులు పాల్గొన్నారు.

# చీరాల టూటౌన్ సిఐ గా పాపారావుకి అటాచ్‌మెంట్ డ్యూటీ..!

**చీరాల(ఒంగోలు), డిసెంబర్ 20 (ప్రజాపాలన) :** చీరాల టూటౌన్ సిఐగా బి.పాపారావుకు అటాచ్మెంట్ డ్యూటీ వేస్తూ, ప్రకాశం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పాపారావు ప్రకాశం జిల్లా అడిషనల్‌ఎస్పీ (అడ్మిన్)కి స్టాఫ్‌ఆఫీసర్ గా ఉన్నారు. తక్షణమే విధుల నుంచి రిలీవయి,చీరాలలో బాధ్యతలను స్వీకరించాల్సిందిగా పాపారావును ఎస్పీ ఆదేశించారు. దాదాపు మూడు నెలలుగా చీరాల టూటౌన్ సీఐ పోస్టు ఖాళీగా ఉంది. మాస్క్ ధరించలేదని దళితయువకుడు కిరణ్‌కుమార్‌ని పోలీసులు కొట్టి చంపినకేసులో టూటౌన్ ఎస్సై విజయకుమార్ ను సస్పెండ్ చేశారు. సదరు ఎస్ఐకు మద్దతుగా కొన్ని తప్పుడు సాక్ష్యాలు సృష్టించారన్న అభియోగం రాగా, అప్పటి చీరాల టూటౌన్ సీఐ ఫిరోజ్ ను కూడా బదిలీ చేయడం తెలిసిందే. అప్పటినుంచి ఈ ఖాళీని భర్తీ చేయలేదు. అయితే ప్రస్తుతం చీరాలలో ఉద్రిక్తవాతావరణం నెలకొని ఉన్న దృష్ట్యా, తాత్కాలికంగా పాపారావును ఆ స్టేషన్ కి సీఐగా పంపారు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేవరకు, పాపారావు చీరాల టూటౌన్ సిఐగా కొనసాగుతారని ఎస్పీ పేర్కొన్నారు. గతంలో పాపారావు చీరాల్లో పనిచేసినందువల్ల ఆయనకు ఈ ప్రాంతంలోని పరిస్థితులన్నీ తెలుసు... ఈ ఉద్దేశంతోనే ఆయనను ఇక్కడకు పంపారని సమాచారం.

# సోషల్ మీడియాపై పోలీసుల నిఘా - ఒకరు అరెస్ట్

చీరాల(ఒంగోలు), డిసెంబర్ 20 (ప్రజాపాలన) : చీరాల నియోజకవర్గంలో వైసీపీలో రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టించే విధంగా సోషల్ మీడియాలో వాట్సప్ గ్రూపుల్లో మెస్సేజ్ లు పంపుతున్న కొత్తపేట గ్రామానికి చెందిన గొల్లపూడి శ్రీనివాసరావు అనే అతన్ని చీరాల టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిపై సైబర్ యాక్ట్ కింద కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేవిధంగా, ఎవరు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అడ్మిన్లు జాగ్రత్తగా వ్యవహరించాలని టూటౌన్ ఎస్సై సూచించారు.

# నేడు మూడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**చీరాల(ఒంగోలు), డిసెంబర్ 20 (ప్రజాపాలన) :** చీరాల మండలం గవినివారి పాలెం, కావూరివారిపాలెం, దేవి నూతల గ్రామాలలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అసిస్టెంట్ ఇంజినీర్ రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పనుల మెయింటెన్స్ నిమిత్తం సరఫరాను నిలిపి వేస్తున్నామని చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని రాంబాబు కోరారు.


అంబేడ్కర్ రాజనీతి ఉద్యమం
Ambedkar Rajaneethi Movement (ARM)
www.ambedkarrajaneethi.com

బహుజనుల కోసం డిమాండ్లు
1. మద్యపానాన్ని నిషేధించాలి
2. మహిళలకు అన్నింటా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి.
3. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలి.
4. న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు కల్పించాలి.
5. వెనుకబడిన తరగతులకు చట్ట సభల్లో 50 - రిజర్వేషన్ కల్పించాలి.
6. ఎస్సీ లకు మత స్వేచ్ఛ కల్పించాలి.
7. బుద్ధుడు ప్రవచించిన సమతా భావాన్ని సమర్థించేలా చర్యలు చేపట్టాలి.
8. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని కులాలకు రిజర్వేషన్ కల్పించాలి.
9. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.
10. రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలి.
11. అందరికి ఉచిత విద్య కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టాలి.
12. ప్రైవేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి.
ఇప్పటికే ఉన్న ప్రైవేటు విద్యా సంస్థల్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలి.
13. ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం అందించాలి.
14. ప్రైవేట్ ఆస్పత్రులను రద్దు చేయాలి.
15. పరిశ్రమల్ని జాతీయం చేయాలి. ప్రైవేట్ రంగంలో నడిచే పరిశ్రమల్లో రిజర్వేషన్ కల్పించాలి.
16. ఆధార్ కార్డు ఉన్న ప్రతి పౌరుడికి 2,00,000/- రూపాయలు ఋణం ఇవ్వాలి.
సక్రమ చెల్లింపుపై తరువాత సంవత్సరం రెట్టింపు ఋణం ఇవ్వాలి.
17. భూమిలేని రైతులకు ప్రభుత్వ/దేవాలయ లేదా ఇతరత్రా ఏదైనా 4 ఎకరాల భూమి ఇవ్వాలి.
18. ప్రతీ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలి.
19. వలసలను అరికట్టేందుకు ఎక్కడికి అక్కడే గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త సాంకేతిక వ్యవసాయ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
20. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చి సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి.
21. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలను ముందుగానే ప్రకటించాలి.

ఇటువంటి విలువైన అంశాలు ఇంకా ఏవైనా
ఉంటే దయచేసి మా దృష్టికి తీసుకురండి.

ఆహ్వానం
అంబేడ్కర్ రాజనీతి ఉద్యమంలో భాగస్వాములుగా
చేరేందుకు బహుజనులందరికీ ఆహ్వానం.
జై భీం, జై ఫూలే, జై బహుజన
సెంట్రల్ వర్కింగ్ కమిటీ
అంబేడ్కర్ రాజనీతి మూవ్ మెంట్

# మలినాలే వ్యాధి మూలం



పుట్టినప్పుడు ఏ శిశువైనా స్ఫటికంలా, కడిగిన ముత్యంలాగే ఉంటాడు. ఎప్పుడో అరుదుగా తప్ప పుట్టుకతోనే జబ్బులు ఉండడం జరగదు. అయితే అంత టి నిర్మలమైన శరీరాల్లో రోజులు గడిచే కొద్దీ ఒక్కొక్కటిగా హానికారకాలేవో పోగవుతాయి.

జాగ్రత్తపడకపోతే శరీరాలు ఒక దశలో రోగాల పుట్టలైపోతాయి. దీనికంతా మధ్యలో వచ్చి చేరే మలినాలే కారణం. ఈ మలినాల్లో కొన్ని వాతావణ కాలుష్యాల్లోంచి వచ్చి చేరితే, మరికొన్ని అతడు తీసుకునే ఆహార పానీయాల తాలూకు వ్యర్థాల్లోంచి వచ్చి చేరతాయి.

వాస్తవానికి శరీరంలో ప్రక ృతి సహజంగానే మలినాలను తొలగించే ఒక బలమైన వ్యవస్థ ఉంది. అయితే, వివిధ కారణాల చేత ఒక్కోసారి ఈ వ్యవస్థ శరీరంలోని మలినాలను పూర్తి స్థాయిలో బయటికి పంపించలేకపోవచ్చు. అలాంటి స్థితిలోనే శరీరంలో విషపదార్థాలు పేరుకుపోతాయి. అందుకు దారితీసే తీవ్రమైన కారణాల విషయం అలా ఉంచితే అతి సాధారణ కారణాలు కూడా శరీరాన్ని విషతుల్యంగా మారుస్తాయి. ఉదాహరణకు శరీరానికి అవసరమైన పోషకాల పరిమాణం తగ్గినా, ఉండవలసిన దానికన్నా పెరిగినా అవి విషతుల్యంగా మారతాయి. ఈ విషపదార్థాలన్నీ ప్రాణాంతకం కాకపోవచ్చు. కానీ, జీవ క్రియలకు ఎంతో కొంత అవరోధంగా మారతాయి. శరీరాన్ని ఆ మేరకు రోగగ్రస్థంగా మారుస్తాయి.

స్థాయీ భేధాలు

ఆయుర్వేదం ప్రకారం అనారోగ్యానికి మూలాలు రెండు రకాలు. ఒకటి దోష స్థాయి, రెండవది వ్యాధి స్థాయి. సాధారణంగా దోషస్థాయిలో ఏ వ్యత్యాసాలూ బయటికి కనపడవు. అవి వ్యాధి రూపం ధరించిన పిదపే దాని లక్షణాలు కనిపిస్తాయి. అయితే, శరీరంలోని అపసవ్యతలను దోష స్థాయిలోనే కనిపెట్టే విధానం ఆయుర్వేదంలో ఉంది. ఈ శాస్త్రం ప్రకారం వాతం, పిత్తం, కఫం అంటూ దోషాలు మూడు రకాలు. ఈ మూడూ మానసిక స్థాయిలోనూ, శారీరక స్థాయిలోనూ ఉంటాయి. నిజానికి వాత, పిత్త, కఫాలు శరీర చలనశక్తికి తోడ్పడేవే. ఇవి కూడా ధాతువులే! అందుకే ఇవి శరీర నిర్మాణానికీ, దాని పనితనానికీ తోడ్పడతాయి. కాకపోతే వీటిది చంచల ప్రవృత్తి. మనం తీసుకునే ఆహారం, మన చర్యలు, ఆలోచనలను బట్టి ఇవి పూటపూటకూ మారుతూ ఉంటాయి. వీటిలో వచ్చే మార్పులూ, హెచ్చుతగ్గులే శరీరం వ్యాధిగ్ర స్థం కావడానికి కారణమవుతాయి. అందుకే వీటిని దోషాలుగా గుర్తిస్తారు. ఏమైనా శరీరంలో పేరుకుపోయే అనవసర అంశాలు, వ్యర్థపదార్థాలే ఈ దోషాలకు ప్రధాన కారణం.

ఆమం... రోగాల హోమం

మనం తీసుకునే ఆహార పదార్థాలు సంపూర్ణంగా జీర్ణం కానప్పుడు శరీరంలో వ్యాధికారకమైన 'ఆమం' పుడుతుంది. దీన్నే 'ఆమవాతం' అని కూడా అంటారు. దీనివల్ల శరీరానికి హాని చేసే పలురకాల ఆమదోషాలు తలెత్తుతాయి. పైగా ఆహార పదార్థాలు నగం-నగంగా జీర్ణమైనప్పుడు వాటిల్లోని ఉపయుక్త అంశాలు, వ్యర్థ అంశాలు పూర్తి స్థాయిలో విడిపోవు. రెండూ కలగలిసిపోయి శరీరాన్ని విషతుల్యం చేస్తాయి. పైగా, జీర్ణం కాని ఆహార పదార్థాలు శక్తిగానూ మారలేవు. పూర్తిగా విసర్జించ నూబడవు. ఇలా విసర్జితం కానివన్నీ శరీరంలో దీర్ఘకాలికంగా ఉండిపోతే, పలు రకాల వ్యాధులు మొదలవుతాయి. దీనికి తోడు ఆమానికి శరీరంలోని స్రోతసుస్సుల్ని మూసివేసే లక్షణం ఉంది. ఈ క్రమంలో రక్తనాళాలు, సిరలు, దమనులే కాకుండా కణానికీ కణానికీ మధ్య ఉండే అతి సూక్ష్మ దారులు కూడా మూసుకుపోతాయి. దీనివ ల్ల జీవక్రియలు కుంటుపడటంతో పాటు, జీవశక్తి అడుగంటిపోతుంది.

విషకారకాలు:

నిర్ణీతకాలంలో మలం విడుదల కాకుండా శరీరంలోనే ఉండిపోతే శరీరం కలుషితమైపోతుంది. అన్నిటికన్నా మించి రక్తం మలినమవుతుంది. వ్యర్థపదార్థాలు నిలిచిపోతే అవి శరీరం లోని చలన శక్తికి అడ్డుపడుతూ ఉంటాయి. శరీరంలో వివిధ దశల్లో దేహక్రియలు నిరంతరం సాగుతూ ఉంటాయి. విషపదార్థాలు ఏ ఒక్క దశను ఆటంకపరిచినా మిగతా దశల మీద కూడా ఆ దుష్ప్రభావం పడుతుంది.

మిశ్రమాలతోనూ సమస్యే

కొన్ని రకాల ఆహార పదార్థాల మధ్య పొంతన కుదరదు. అలాంటి పొంతన కుదరని వాటినే 'విరుద్ధ ఆహార పదార్థాలు' అంటారు. అలాంటి విరుద్ధ ఆహార పదార్థాలను కలిపి గానీ, వెనువెంటనే గానీ తీసుకోకూడదు. విరుద్ధ ఆహారాలు శరీరంలో దోషాలు నింపడమే కాదు. దోషాలను బయటికి వెళ్లిపోకుండా లోపలే బంధిస్తాయి. అవన్నీ చివరికి విషపదార్థాలుగా మారతాయి.

నిషిద్ధాహారాలు...

మాంసం లేదా చేపల్లో మినప పప్పుగానీ, పాలు గానీ, తేనెగానీ కలపకూడదు.

ఆకు కూరలు తిన్న తరువాత పాలు తాగకూడదు. కోడి మాంసం, పెరుగు కలిపి తీసుకోకూడదు. అతి స్వల్ప వ్యవధిలో కూడా తీసుకోకూడదు.

పాయసం, మద్యం, అన్నం కలిపి తీసుకోకూడదు.

తేనె, నెయ్యి, కొవ్వు పదార్థాలు, నీళ్లు, నూనె- వీటిలో ఏ రెండుగానీ, అన్నీ గానీ, సమాన నిష్పత్తిలో తీసుకోకూడదు. పైగా ఇవి తీసుకున్న వెంటనే నీరు తాగకూడదు.

పెరుగు, ముల్లంగి, ఎండుమాంసం, ఎండు చేపలు, పందిమాంసం, గొర్రె మాంసం, చేపలు రోజూ తీసుకోకూడదు. అలాగే మినపపప్పు కూడా అలా నిరంతరంగా తీసుకోకూడదు.

విషానికి విరుగుడు

శరీరంలో పేరుకుపోయిన విషపదార్థాల వల్ల ఒక్కో ధాతువులో ఒక్కో రకం దోషం పెరుగుతుంది. ఈ స్థితిలో శరీరాన్ని విషతుల్యం చేసే ఆ కారణాలను తొలగించడమే నిజమైన చికిత్స అవుతుంది. అందుకు శరీరాన్ని శుద్ధి చేసే 'శోధన చికిత్సలు' చేయాలి. దీనికి ఐదు రకాల ప్రక్రియలతో ఉండే పంచకర్మ చికిత్స ఉత్తమ మార్గం. అవసరాన్ని బట్టి పంచకర్మల్లోని ఐదు చికిత్సల్లో ఏదో ఒకటిగానీ, అన్నీగానీ చెయ్యాలి. వీటికి తోడు జలమర్దనం, స్నేహనం ( శరీరానికి నూనె పట్టించడం), స్వేదనం ( ఆవిరి స్నానం ) కూడా అవసరమే. వీటికి తోడు ప్రత్యేకమైన కొన్ని రకాల ఆహార పదార్థాలు తీసుకోవలసి ఉంటుంది. శరీర స్థితిగతిని శరీర ధర్మాన్ని అనుసరించి ఇచ్చే ఈ ఆహార పదార్థాలతో శరీరంలో మూతబడిన స్రోతస్సులన్నీ తెరుచుకుంటాయి. దాంతో శరీరమూ, మనస్సూ కొత్త శక్తినీ, కొత్త చైతన్యాన్నీ పుంజుకుంటాయి.

## వెంట్రుకలు ఊడకుండా...

శిరోజాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కొన్ని ఉన్నాయి. వాటిని పాటిస్తే వెంట్రుకలు అందంగా, ఆరోగ్యంగా ఉండడంతోపాటు జుట్టు రాలిపోదు. ఆ జాగ్రత్తలు ఏమిటంటే...

ఎలాంటి హెయిర్ స్టైల్ వేసుకోవాలన్న దానిపై స్పష్టత ఉండాలి. మీరు కోరుకుంటున్న స్టయిల్ ఫోటోలను హెయిర్ స్టయిలిస్టుకు చూబిస్తే పని సులువుగా అయిపోతుంది.

రాత్రి పడుకోబోయేముందు శిరోజాలను మొదళ్ల నుంచి చివర్ల దాకా బ్రష్‌తో దువ్వుకోవాలి. ఇలా చేయడం వల్ల సహజ నూనెలు కుదుళ్ల నుంచి జుట్టు మొత్తానికీ బాగా పట్టుకుంటాయి. ఫలితంగా వెంట్రుకలు ఆరోగ్యంగా ఉండి మెరుస్తాయి.

జుట్టుకు రంగు వేసుకునేటప్పుడు ఒకటి రెండు షేడ్స్‌కు మాత్రమే పరిమితం కావాలి. లేకపోతే మెస్సీగా తయారవుతుంది.

తడి వెంట్రుకలను దువ్వుకునేటప్పుడు తల మధ్య నుంచి కొనవరకూ మొదట దువ్వాలి. ఆ తర్వాత మాడు నుంచి జుట్టు మధ్య భాగం దాకా దువ్వాలి.

మెడ వెనుక భాగంలోని మీ నేచురల్ హెయిర్‌లైన్ విషయంలో హెయిర్ స్టయిలిస్టును జోక్యం చేసుకోనివ్వద్దు.

కండిషనర్‌ని చల్లటి నీళ్లతో కడుక్కోవాలి. ఇలా చేయడం వల్ల శిరోజాలు మెరుస్తాయి.

ఎండవేడి నుంచి వెంట్రుకలను రక్షించుకునేందుకు స్కార్ఫ్ లేదా హ్యాట్ పెట్టుకోవాలి.

వెడల్పాటి పళ్లున్న దువ్వెనతో పొడి జుట్టును దువ్వితే చిక్కు ఈజీగా పోతుంది.

జుట్టుకు రంగు వేసుకున్నప్పుడు సల్ఫేట్ లేని షాంపూలు, కండిషనర్లు వాడాలి. ఎందుకంటే వెంట్రుకలను దెబ్బతీసే గాఢమైన డిటర్జంటులు వీటిల్లో ఉండవు.

జుట్టు రేగిపోయేవాళ్లు దువ్వెన లేదా హెయిర్ బ్రష్ మీద స్టాటిక్ గార్డ్ స్ప్రే చేసి, దువ్వుకోవాలి.



# ప్రోస్టేట్ గ్రంథికి ఏమన్నా అయితే...



రోజుకు నాలుగైదు లీటర్ల దాకా నీళ్లు తాగాలి. కానీ, ఆ తాగిన నీటిలో చాలా భాగం మూత్రం ద్వారా తిరిగి బయటికి వెళ్లిపోవాలి కదా! ఆ ప్రక్రియ సాఫీగా సాగిపోకుండా, తరచూ అంతరాయం ఏర్పడుతుంటే అప్పుడు ఏం చేయాలి? ప్రోస్టేట్ గ్రంథి వ్యాధిగ్రస్థమైనప్పుడు వచ్చే చిక్కే ఇది. ఇంతకీ ప్రోస్టేట్ గ్రంథి ఏమిటి? అది వ్యాధిగ్రస్థం కావడం ఏమిటి? మనమంతా ప్రోస్టేట్‌గా పేర్కొనే గ్రంథి వాస్తవానికి అనేకమైన చిన్న చిన్న గ్రంథుల సమూహం. పురుషుల్లో మాత్రమే ఉండే ఈ గ్రంథి, మూత్రాశయానికి దిగువన, మూత్రనాళానికి చుట్టుకుని బాదం గింజంత పరిమాణంలో ఉంటుంది. నిజానికి, దేహ వ్యవస్థకు ప్రత్యేకించి ఆరోగ్యవ్యవస్థకు ఈ గ్రంథి ఎలా తోడ్పడుతుందో ఇప్పటికీ స్పష్టంగా తెలియదు. కాకపోతే, రేతస్సు ఉత్పత్తికీ, దాని విడుదలకూ ఒక వాహకంగా పనిచేస్తుంది.

అయితే మిగతా అవయవాలలా కాకుండా, ప్రోస్టేట్ గ్రంథిలోని పాత జీవకణాలు చనిపోయి, బహిష్కరించబడక ముందే వాటికన్నా అధిక సంఖ్యలో కొత్త కణాలు ఉత్పత్తి అవుతాయి. ఫలితంగా దాని పరిమాణం అతిగా పెరుగుతుంది. దేహ ఆరోగ్య వ్యవస్థకు విరుద్ధంగా ఈ ప్రక్రియ ఎందుకు జరుగుతుందో ఇప్పటికీ స్పష్టంగా తెలియదు. నిజంగానే ఎవరికైనా ఈ పరిస్థితి ఏర్పడినప్పుడు మూత్రాన్ని బయటికి నెట్టడానికి, మూత్రాశయం గట్టిగా ప్రయత్నిస్తుంది.

ఈ ప్రక్రియలో మూత్రాశయం గోడలు మందం కావడంతో పాటు గట్టిపడ తాయి. పర్యవసానంగా క్రమక్రమంగా మూత్రాశయం చిన్నదైపోయి, పదేపదే మూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. విసర్జనలోని అంతరాయం వల్ల మూత్రం లోపలే నిలిచిపోతుంది. ఫలితంగా అందులోని వ్యర్థ, విషపదార్థాలు సూక్ష్మజీవుల ప్రభావంతో మూత్రాశయం కంపరానికి గురై, కందిపోయి నొప్పి మొదలవుతుంది. ఈ క్రమంలో మూత్రాశయంతో పాటు మూత్రపిండాలూ వ్యాధిగ్రస్థమై రెండింటిలోనూ రాళ్లు ఏర్పడవచ్చు. సూక్ష్మ జీవుల వల్ల ప్రోస్టేట్ గ్రంథి వ్యాధిగ్రస్థమైనప్పుడు వాచి, కంది, గడ్డలు కట్టి, చీముపట్టి బాధలు, పోట్లు కలిగించవచ్చు. దీన్నే ప్రోస్టటైటిస్ అంటారు. ఈ వ్యాధికి వయసుతో నిమిత్తం లేదు. కొందరి ప్రోస్టేట్ గ్రంథిలో కేన్సర్ వ్యాధి సంభవించి, విషపూరిత కణాలు కుప్పతెప్పలుగా ఉత్పన్నం కావచ్చు. అందుకే ప్రోస్టేట్ సమస్యలతో బాధపడుతున్నవారు తమకున్న అసలు సమస్య ఏమిటో వైద్య పరీక్షల ద్వారా నిర్ధారించుకోవడం చాలా అవసరం.

కారణాల్లో కొన్ని.....

50 ఏళ్లకు పైబడిన పురుషుల్లో వివిధ కారణాల వల్ల వారి ప్రోస్టేట్ గ్రంథిలో డైహైడ్రో టెస్టోస్టిరాన్ అనే రసాయన సాంద్రత పెరుగుతుంది, దీనికి ప్రోస్టేట్ గ్రంథిలోని జీవకణాలను కుప్పతెప్పలుగా పెంచే గుణం ఉందని వైద్య శాస్త్రజ్ఞుల నమ్మకం. అయితే ఏ వయసులోనైనా మూత్ర విసర్జనకు సంబంధించి ఏ చిన్న సమస్యనైనా నిర్లక్ష్యం చేయడం ఆరోగ్యానికి హానికరం.

మూలికా వైద్యం...

ప్రోస్టేట్ అసహజ పెరుగుదలకు, బాధాకరమైన ప్రోస్టటైటిస్ సమస్యలకూ సమర్థమైన మూలికా చికిత్సలు ఉన్నాయి.

సాపాల్మిట్టో అనే మూలికతో కలిగే ఉపయోగాలు చాలా ఎక్కువ. ప్రత్యేకించి, ప్రోస్టేట్ గ్రంథి పెరుగుదలకు, జీర్ణవ్యవ స్థలకు సంబంధించిన అనేక వ్యాధులు నయమవుతున్నాయి. యూరోపియన్ దేశాలు అన్ని రకాల మూత్ర వ్యవస్థాపరమైన, ప్రోస్టేట్ గ్రంథిపరమైన వ్యాధులకు ఈ మూలికనే వాడుతున్నారు.

చైనీస్ జిన్సింగ్స్ అనే మూలికనూ, తేనెటీగెలు సేకరించిన పుప్పొడినీ కూడా ఈ వ్యాధులకు వాడుతున్నారు.

అమెరికాలోని మహగొని అనే చెట్టు చిదుకు పుల్లలకు, ఆకులకు, బెరడుకు కూడా ప్రోస్టేట్ గ్రంథి పెరుగుదలనూ, బ్యాక్టీరియాతో వ్యాధిగ్రస్థమైన ప్రోస్టేట్ గ్రంథినీ, ప్రోస్టేట్ కేన్సర్‌నూ నయం చేయగల శక్తి ఉందని కనుగొన్నారు.

కూచ్‌గ్రాన్, ఎకినేసియా, హైడ్రెంజియా, బెర్బరీస్, బచ్చు, స్టింగింగ్ నెట్టిల్ అనే మూలికలను కూడా ప్రోస్టేట్ గ్రంథులకు వాడి, శస్త్ర చికిత్సతో అవసరం లేకుండా చేస్తున్నారు.

అయితే ప్రోస్టేట్ పెరుగుదలకు, మిగతా ప్రోస్టేట్ వ్యాధులకూ, దేహ వ్యవస్థలోని మిగతా రుగ్మతలను గమనిక లోకి తీసుకుని అందిస్తారు. అంతే తప్ప మూలికల పేర్లు తెలియగానే వైద్య నిపుణుడి ప్రమేయం లేకుండా, స్వయంగా వైద్యం చేసుకోవాలనుకోవడం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు.

సహజ పరిమాణానికి మించి ప్రోస్టేట్ గ్రంథి పెరిగిపోయినప్పుడు అది మూత్రనాళాన్ని లోపలికి నెట్టి మూత్రం సాఫీగా విడుదల కాకుండా ఆటంకపరుస్తుంది. మూత్రం అనుకున్న వెంటనే రాకపోవడం, వచ్చినా ఏదో ఇరుక్కున్నట్లు సన్నగా రావడం, మూత్రం ఆగి ఆగి, చుక్కలు చుక్కలుగా రావడం, రాత్రిపూట తరుచూ మూత్రం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవ న్నీ పరిమితిని మించి ప్రోస్టేట్ గ్రంథి పెరగటాన్ని సూచిస్తాయి.

# కురుల కోసం మాస్క్

చలికాలంలో జుట్టు పొడిబారిపోవడం అందరికీ ఎదురయ్యే ప్రధానమైన సమస్య. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే జుట్టు ఊడిపోవడం ఖాయం. దీని కోసమే చాలా సింపుల్ చిట్కాలు ఉన్నాయి. వీలుంటే ఒక్కసారి ట్రై చేయండి...



కొబ్బరి నూనె మాస్క్

ఇంట్లో అందుబాటులో ఉండే కొబ్బరి నూనె చాలు. జుట్టుకు ఇంతకు మించిన నేస్తం ఎక్కడ ఉంటుంది? రెండు టేబుల్‌స్పూన్ల కొబ్బరినూనెలో పాలు కలిపి ఆ మిశ్రమాన్ని తలకు రాయండి. ఓ మూడు గంటల తర్వాత తలస్నానం చేయండి. ఇలా కొన్నాళ్లు చేస్తే జుట్టు రాలే సమస్య కూడా తగ్గుతుంది.

ఆలివ్ ఆయిల్ మాస్క్

మూడు టేబుల్ స్పూన్ల ఆలివ్‌నూనెలో మూడు కోడిగుడ్డు సొనలను కలిపి ఆ మిశ్రమాన్ని తలకు పట్టించండి. ఓ గంట తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయండి. కోడిగుడ్డు సొన జుట్టు పొడిబారకుండా కాపాడుతుంది.

ఆలివ్-బనానా మాస్క్

అరటిపండుకు కూడా జుట్టు సమస్యలను పోగొట్టే గుణాలు ఉన్నాయి. రెండు టేబుల్‌స్పూన్ల నూనె, అరటిపండు గుజ్జు, యోగర్ట్ కలిపి తలకు రాయండి. గంట తర్వాత షాంపు చేయండి. అరటిపండులో పొటాషియం, యోగర్ట్‌లో ఉండే లాక్టిక్ యాసిడ్ జుట్టు పొడవకుండా కాపాడతాయి.

# కలవరపెడుతున్న 'డీ' విటమిన్

ఉదయం తొమ్మిది గంటలకు నిద్ర లేవడం... పదింటికల్లా ఆఫీసుకు ఉరకడం. ఏసీ గదుల్లో... కాసింత ఎండ కూడా దూరని ప్రదేశంలో కంప్యూటర్లు... ల్యాప్‌టాప్‌లతో కుస్తీపట్టడం... రాత్రి మళ్లీ 7 లేక 8 గంటలకు ఇంటికి పరుగు తీయడం. ఇదీ మన నగరవాసి దినచర్య. దీంతో మంచి జీతం... ఆఫీసులో ప్రమోషన్ రావచ్చేమో గానీ.. ఆరోగ్యం కోల్పోడం గ్యారంటీ అంటున్నారు వైద్యులు. ఎందుకంటే శరీరానికి ఎండ తగలక పట్టణ వాసుల్లో సగానికి సగం మంది విటమిన్ డీ లోపంతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం చెబుతోంది. పైసా ఖర్చు లేని విటమిన్, ప్రకృతి నుంచి లభించే విటమిన్, జీవక్రియలు సవ్యంగా జరగడానికి పెద్దన్న పాత్ర పోషించే విటమిన్ డీ నగరవాసిలో లోపించడానికి కారణాలేంటో తెలుసుకుందాం..!

80 % నగరవాసుల్లో 'డీ' విటమిన్ లోపం: వైద్యులు

సూర్యరశ్మి తగలకే ఈ సమస్యలు

చిన్న పిల్లల్లో ఎదుగుదల లోపాలకు కారణం

వృద్ధుల్లో ఆర్థో సమస్యలు

యువకుల్లో కండరాల బలహీనత, మానసిక ఒత్తిడి

ఇవన్నీ డి విటమిన్ లోపం వల్ల కలిగే అనర్థాలే

ప్రకృతి ఇచ్చే వరం డి విటమిన్

రోజుకు 20 నిమిషాలు ఎండను ఆస్వాదిస్తే ఆరోగ్యం సొంతం అంటున్న నిపుణులు

సన్‌స్క్రీన్ లోషన్లు రాసుకోవడం వల్ల శరీరానికి డీ విటమిన్ అందదు. ఉదయం 8 నుంచి 10 లేక సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య కనీసం 20 నిమిషాలు శరీరానికి సూర్యకిరణాలు బాగా తాకేలా చూసుకుంటే డీ విటమిన్ సమృద్ధిగా లభిస్తుంది.

ప్రపంచ వ్యాప్తంగా సుమారు 100 కోట్ల మంది విటమిన్ డీ లోపంతో బాధపడుతున్నారు. నగరాల్లో అయితే సుమారు 60 నుంచి 80 శాతం మందిలో డీ విటమిన్ ఉండాల్సిన స్థాయి కంటే చాలా తక్కువ ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనంలో తేలింది. కొంత మంది వైద్యవిద్యార్థులు ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చ్‌లో భాగంగా నగరంలో డీ విటమిన్ లోపంపై ఓ అధ్యయనం చేపట్టారు. 25 శాతం మందిలో మాత్రమే డీ విటమిన్ లోపం లేనట్లు వారు గుర్తించారు. అంతేకాదు.. పురుషులకన్నా స్త్రీలలోనే ఆ సమస్య ఎక్కు వని తేల్చారు. గర్భిణులలో 84 శాతం మంది డీ విటమిన్ లోపంతో ఇబ్బందిపడుతున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి రక్తంలో డీ విటమిన్ మోతాదు 30 ఎన్‌జీఎంఎల్ ఉంటే, సాధారణ స్థాయిలో ఉన్నట్లు. అయితే.. నగరవాసుల్లో మాత్రం ఈ మోతాదు 20 ఎన్‌జీఎంఎల్ కంటే తక్కువుందని అధ్యయన కర్తలు అంటున్నారు.

విటమిన్ డీ ఏం చేస్తుంది..?

ఎముకల దృఢత్వానికి, సాంద్రతకు, కండరాల శక్తికి, గుండె రక్తనాళాల పనితీరుకు, కొన్ని రకాల హార్మోన్ల తయారీకి కీలకం విటమిన్ డీ. శరీరానికి ఎండ తగిలినప్పుడు చర్మం కింద ఉండే కణజాలం ఆ సూర్యరశ్మిని గ్రహించడం ద్వారా శరీరంలో జీవక్రియ సులువుగా జరగడానికి దోహదపడుతుంది. క్యాల్షియం తయారవడానికి మూలమవుతుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలను ఉత్తేజపరుస్తుంది. పాంక్రియాస్ నుంచి ఇన్సులిన్‌ను సక్రమంగా ఉత్పత్తి చేసేందుకు తోడ్పడుతుంది. స్టిరాయిడ్స్ హార్మోన్లను కట్టడి చేస్తుంది. తద్వారా హార్మోన్ల వ్యవస్థ గతితప్పకుండా కాపాడుతుంది. మొత్తం మ్మీద విటమిన్ డీ వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, మనిషి ఆరోగ్యానికి అందాల్సిన ప్రాధాన్యత కలిగిన విటమిన్లలో డీ కూడా ముఖ్యమైనదని లైఫ్‌స్టైల్ వైద్యులు డాక్టర్ భక్తియార్ చౌదరి వివరిస్తున్నారు.

ఇది తగ్గితే నష్టమేంటి?

శరీరంలో డీ విటమిన్ తగ్గడం వల్ల చాలా రకాల అనా రోగ్య సమస్యలు తలెత్తుతాయి. సహజంగా చిన్న వాళ్లలో ఎదుగుదల లోపాలు, పెద్దల్లో ఆర్థోపెటిక్ సమ స్యలు వస్తాయి. ఇక యువకులూ దీనికి బాధితులే. పట్టణంలో ఏ మాత్రమూ ఇంట్లోకి ఎండ రావడానికి అవకాశం లేదు. ఆరుబయట కాసేపు సూర్యరశ్మిని ఆస్వాదిద్దామంటే అంత సమయం లేదు. ఆఫీసులో అంతా చలువ అద్దాలతో మూసేసుంటుంది. ఇక శరీరానికి సూర్యకిరణాలు ఎక్కడి నుంచి సోకుతాయి. డీ విటమిన్ సహజంగా తినే ఆహార పదార్థాల్లో కూడా లభించదు. దాంతో కొంచెం




శ్రమ చేసినా అలసిపోవడం, నీరసం, నిస్సత్తువ, తీవ్రమైన బడలిక వంటివి ఆవహిస్తాయి. రక్తపోటు, మధుమేహం టక్కున దరిచేరతాయి. స్థూలకాయానికి దారితీస్తుంది. గుండె సంబంధిత జబ్బులు కూడా తలెత్తవచ్చు. క్యాల్షియం తగ్గిపోయి ఎముకలు గుల్లబారడం వంటి సమస్యలు అధికమవుతాయి.

రోజుకు 20 నిమిషాలు...

శరీరానికి సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాలు సోకడం వల్ల డీ విటమిన్ ఉత్పత్తి అవుతుంది. రోజుకు 20 నిమిషాలు ఆరుబయట సూర్యకాంతి తగిలే ప్రదేశంలో గడిపితే ఈ విటమిన్ దండిగా లభిస్తుందని చెబుతున్నారు నిపుణులు. ఇది కూడా సూర్యోదయం అయిన గంటన్నర తర్వాత, సూర్యాస్తమయానికి ఒక గంటన్నర ముందు ఉండే ఎండను ఆస్వాదించాలి. జీవనశైలిలో ఎండను ఆస్వాదించడం ఒక భాగం చేసుకుంటే సరి!

పెద్ద ఆరోగ్య సమస్య...

రోజుకు కనీసం 20 నిమిషాలన్నా ఎండను ఆస్వాదించాల్సిందే. లేకపోతే క్యాల్షియం తగ్గిపోయి ఆర్థోపెటిక్ సమస్యలు తీవ్రంగా ఉత్పన్నమవుతాయి. గుడ్డులోని పచ్చసొన, పుట్టగొడుగులు వంటి ఆహార పదార్థాల్లోనే కొంచెం డీ విటమిన్ ఉంటుంది. తీసుకునే ఆహారం వల్ల తక్కువగానే లభిస్తుంది. పాఠశాలల్లో కూడా పిల్లలకు సూర్యరశ్మి తాకే విధంగా తరగతి గదులు ఉండాలి. జిమ్‌కు వెళ్లే వారు సైతం ఆరుబయట వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. ఇప్పుడు నగరాలు ఎదుర్కొంటున్న పెద్ద ఆరోగ్య సమస్యల్లో ఇది ఒకటి.

- డాక్టర్ కె.అరుణ, పోషకాహార నిపుణురాలు

ఎదుగుదల లోపాలకు కారణం...

విటమిన్ డీ లోపం వల్ల ఇన్సులిన్ సరిగ్గా ఉత్పత్తి జరగక డయాబెటిస్-2 వచ్చే అవకాశం ఉంది. థైరాయిడ్ సమస్యలూ తలెత్తుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. పిల్లల్లో ఎదుగుదల సమస్యలు, ముఖ్యంగా ఊబకాయానికి కారణమవుతుంది. అధిక రక్తపోటు, దానితోపాటు గుండె రక్తనాళాలు సరిగా పనిచేయకపోవడం వంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తుతాయి. కొంత మేరకు మాత్రలు, పౌడర్ల ద్వారా డీ విటమిన్ ఇస్తుంటాం. కానీ ఇది అందరికీ మంచిది కాదు.

- డాక్టర్ జయంతి రమేష్, సీనియర్ ఎండో క్రైనాలజిస్ట్

# సినిమాస్కోప్

## రొమాంటిక్ 'పుష్ప' పుకార్లే



అల్లు అర్జున్.. సుకుమార్ ల కాంబోలో రూపొందుతున్న పుష్ప సినిమా షూటింగ్ ఇటీవలే ప్రారంభం అయ్యింది. మొదటి షెడ్యూల్ ను ఏపీ అడవుల్లో నిర్వహించిన సుకుమార్ రెండవ షెడ్యూల్ ను హైదరాబాద్ లోనే జరుపుతున్నాడు. ఇక ఈ సినిమా షూటింగ్‌లో భాగంగా ఒక రొమాంటిక్ సాంగ్ చిత్రీకరణ జరుపుతున్నారనే వార్తలు వచ్చాయి. అల్లు అర్జున్.. పూజా హెగ్డేలతో పాటు పెద్ద ఎత్తున డాన్సర్లు కూడా ఈ షూటింగ్ లో పాల్గొంటున్నారు అనే ప్రచారం జరిగింది. మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం అంటూ యూనిట్ సభ్యులు అధికారికంగా క్లారిటీ ఇచ్చారు. మొదటి షెడ్యూల్‌తో పాటు ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్ లో కూడా యాక్షన్ సన్నివేశాలు.. చేజింగ్ సీన్స్ ను మాత్రమే చిత్రీకరిస్తున్నట్లుగా పేర్కొన్నారు. మీడియాలో జరుగుతున్నట్లుగా రొమాంటిక్ పాట చిత్రీకరణ జరగడం లేదన్నారు. ఇంకా షూటింగ్‌లో రష్మిక జాయిన్ అవ్వలేదని జనవరిలో ఆమె ప్రజెన్స్‌లో షూటింగ్ జరుగబోతుంది అంటూ పుష్ప మేకర్స్ అనధికారికంగా పేర్కొన్నారు. ఈ సినిమాలో అల్లు అర్జున్ తో పాటు రష్మిక కూడా డీ గ్లామర్ గా కనిపించబోతున్నారు. అలాంటప్పుడు రొమాంటిక్ సాంగ్ సాధ్యమేనా అనేది ఆలోచించకుండా మీడియాలో కొందరు పుకార్లు ప్రచారం చేస్తున్నారంటూ బన్నీ అభిమానులు అసహనం వ్యక్తం చేస్తు న్నారు.

## లేడీసూపర్ స్టార్ 'ప్రేమమ్'



లేడీ సూపర్ స్టార్ నయనతార సినిమాల జోరు కంటిన్యూ అవుతూనే ఉంది. ఏడాదికి అరడజను సినిమాల వరకు ఈమె ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తూనే ఉంది. ఒక వైపు రజినీకాంత్.. విజయ్ వంటి సూపర్ స్టార్ లతో నటిస్తూనే మరో వైపు మూకుత్తి అమ్మన్ వంటి లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తుంది. ప్రస్తుతం ఈమె రజినీకాంత్ మూవీ అన్నాత్తేలో నటించడంతో పాటు ప్రియుడి దర్శకత్వంలో రూపొందుతున్న ఒక ముక్కోణపు ప్రేమ కథలో కూడా నటిస్తోంది. ఈ రెండు సినిమాలతో పాటు మరో రెండు కూడా చర్చల దశలో ఉన్నాయి. ఈ సమయంలోనే ఒక క్రేజీ మూవీలో ఈమె హీరోయిన్ గా ఎంపిక అయ్యింది. 'ప్రేమమ్' సినిమాతో అందరిని ఆకట్టుకున్న దర్శకుడు ఆల్ఫాన్స్ పుత్రెన్స్ దర్శకత్వంలో 'పాత్తు' అనే సినిమా రూపొందుతుంది. ఆ సినిమాలో నయన్ ను ఎంపిక చేశారట. ఫహద్ ఫసిల్ హీరోగా రూపొందబోతున్న పాత్తు సినిమాలో నయనతార నటించబోతున్నట్లుగా యూనిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. ప్రేమమ్ సినిమాతో దేశ వ్యాప్తంగా దర్శకుడు ఆల్ఫాన్స్ మంచి పేరు దక్కించుకున్నాడు. ప్రస్తుతం ఈయన చేస్తున్న ఈ సినిమాను పలు భాషల్లో విడుదల చేయాలని భావిస్తున్నాడు. అన్ని భాషల్లో విడుదల చేసేవిధంగా సినిమాను రూపొందించాలనే అభిప్రాయంతో ఉన్నాడు. మలయాళంలో రూపొందబోతున్న ఈ సినిమాకు తెలుగు మరియు తమిళంలో నయన్ వల్ల మంచి క్రేజ్ ఏర్పడటం ఖాయం. ఇక కన్నడం మరియు హిందీల్లో ఎలాగూ దర్శకుడికి ఉన్న పేరుతో మార్కెట్ అయ్యే అవకాశం ఉంది. కనుక పాత్తు సినిమా ఒక భారీ పాన్ ఇండియా మూవీగా నిలిచే అవకాశం ఉందంటున్నారు.

## పూజా.. తన హీరోల్ని వర్ణిస్తోందా.. బిస్కెట్ వేస్తోందా?



అల వైకుంఠపురములో సక్సెస్ తర్వాత బుట్టబొమ్మ పూజా హెగ్డే లైనప్ చూస్తే మరింత క్రేజీగా ఉంది. ప్రస్తుతం టాలీవుడ్ బాలీవుడ్ లో పలు భారీ క్రేజీ చిత్రాల్లో నటిస్తోంది. ప్రభాస్– రణవీర్ సింగ్ – సల్మాన్ ఖాన్ లాంటి టాప్ హీరోల సరసన నటిస్తూ బిజీగా ఉంది. రాధే శ్యామ్– సిర్కస్ – కబీ ఈద్ కబీ దీవాళి(సల్మాన్) వంటి చిత్రాలలో నటిస్తోంది. తాజా ఇంటర్వ్యూలో పూజా ఆ ముగ్గురు స్టార్ హీరోల గురించి ఫన్నీ వర్ణణ చేయడం అభిమానుల్లో చర్చకు వచ్చింది. ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. రెబెల్ స్టార్ –గూఫీ అని.. అతను ఒక్కడే కనిపించినా ఇక ఇంటర్వ్యూల్లో సిగ్గు పడడు అని ఫన్నీగా చెప్పేసింది. పూజా తన సిర్కస్ సహనటుడు రణవీర్ సింగ్ ను బాల్ ఆఫ్ ఎనర్జీ అని వర్ణించింది. చివరగా సల్మాన్ గురించి చెబుతూ.. పట్టణంలో చక్కని వ్యక్తి.. నిజమైన అరుదైన వ్యక్తి అని అభివర్ణించింది. తన హీరోల్ని ఎంత గొప్పగా వర్ణించిందో కదా!! అన్నట్టు ఎవాన్స్ట ఎలిజిబుల్ బ్యాచిలర్ అఖిల్ గురించి ఏమీ చెప్పనే లేదేంటబ్బా!! ఇంతకీ పూజా.. తన హీరోల్ని వర్ణిస్తోందా.. బిస్కెట్ వేస్తోందా? తొందర్లేనే తేల్తుంది!

## నన్ను తన్నేందుకు చిరంజీవి ఒప్పుకోలేదు



సినిమా అన్నప్పుడు హీరో తన్నాలి.. విలన్ పడాలి. హీరో ఎంత గట్టిగా కొడితే సినిమాలో హీరోయిజం అంతగా ఎలివేట్ అవుతుంది అనడంలో సందేహం లేదు. విలన్ ఎంత పవర్ ఫుల్ అయినా క్లైమాక్స్ లోనే లేక మధ్యలోనే అయినా హీరో చేతిలో చావు దెబ్బలు తినాల్సిందే. కాని ఆచార్య సినిమాలో హీరోగా నటిస్తున్న విలన్ సోనూ సూద్‌ను కొట్టేందుకు చిరంజీవి కాస్త వెనుకంజ వేశాడట. సోనూ సూద్ ఈమధ్య కాలంలో రియల్ హీరోగా మంచి పేరు తెచ్చుకున్నాడు. రీల్ హీరోల కంటే రియల్ హీరో అయిన సోనూ సూద్ కు ఇప్పుడు ఎక్కువ పేరుంది. అలాంటి సోనూ సూద్ ను చిరంజీవి ఒక సీన్ లో తన్నాల్సి ఉండగా అందుకు ఒప్పుకోలేదట. షూటింగ్ లో భాగంగా ముందుగా అనుకున్న ఫైట్ సీన్‌ను కాకుండా కాలు మీద పెట్టకుండా రీ షూట్ చేయాల్సి వచ్చిందట. ఆ విషయాన్ని స్వయంగా సోనూ సూద్ అన్నాడు. నేను పర్వాలేదు అందుకు నేను ఓకే అంటూ చెప్పినా కూడా చిరంజీవి మీపై కాలు లేపితే నాపై జనాలు నోరు లేపుతారు. నన్ను విమర్శిస్తారు అన్నట్లుగా వ్యాఖ్యలు చేశారట. చిరంజీవి నాపై కాలు పెట్టే సీన్‌ను కట్ చేసి దాని ప్లేస్ లో మరో షాట్‌ను ప్లాన్ చేశారు అంటూ సోనూసూద్ అన్నాడు. ఇలాంటి కారణాల వల్లే సోనూ సూద్ కు ఆఫర్లు తగ్గుతున్నాయని అంటున్నారు. జనాలు సోనూసూద్ ను స్క్రీన్‌పై బ్యాగ్‌గా చూసేందుకు ఇష్టపడుతారా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. సోనూసూద్ పారితోషికం భారీగా అయితే పెంచాడు కాని ఆఫర్ల విషయాలో మాత్రం ఇన్ని అడ్డు వస్తున్నాయట.

## రకుల్ ఆనంద 'యోగం'..



తెలుగులో టాప్ హీరోయిన్ లిస్టు లో ఉంది పంజాబీ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్. ఆన్ స్క్రీన్ లో తన లుక్‌తో కుర్రకారు మతి పోగొడుతుంది ఈ చిన్నది. అయితే.. ఆ స్ట్రక్చర్ ఊరికే వచ్చింది కాదు. దేవుడిచ్చిన అందాన్ని సౌష్టవాన్ని.. ఇలా కష్టపడి కాపాడుకుంటోంది ఈ చిన్నది. ఫిట్ నెస్ కాపాడుకోవడంలో తనకు తానే సాటి అన్నట్టుగా.. నిత్యం కఠినమైన వర్కవుట్లు చేసే ఈ భామ.. ప్రశాంతత కోసం ఇలా యోగాసనాలు కూడా వేస్తుంది. మాల్దీవుల టూర్‌లో తాను యోగా చేస్తున్నప్పుడు క్లిక్ మనిపించిన స్టిల్‌ను తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది రకుల్. బీచ్ ఒడ్డున ఉన్న ఆమె హట్ వద్ద రకుల్ వేసిన ఆసనం అందరినీ ఆకర్షిస్తోంది. ప్రస్తుతం చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'చెక్' మూవీలో రకుల్ హీరోయిన్ గా నటిస్తోంది. ఇంకా.. క్రిష్ రాబోయే ప్రాజెక్టులోనూ ఛాన్స్ దక్కించుకుంది. అదేవిధంగా.. అజయ్ దేవ్గన్ హీరోగా నటిస్తున్న బాలీవుడ్ మూవీ 'మే డే'లోనూ ఈ పంజాబీ భామ నటిస్తోంది. ప్రస్తుతం ఈ షూట్ హైదరాబాద్లో కొనసాగుతోంది.

### ఛాలెంజింగ్ రోల్‌లో నాగశౌర్య..!

యువ కథానాయకుడు నాగశౌర్య స్పోర్ట్స్ డ్రామా లక్ష్య సినిమాతో పాటు వరుడు కావలెను సహా మరికొన్ని ప్రాజెక్ట్స్‌తో ఫుల్ బిజీ బిజీగా ఉన్నాడు. ఈ సినిమాలతో పాటు మరో క్రేజీ ప్రాజెక్ట్‌లో నాగశౌర్య నటించబోతున్నారని సమాచారం. ఆసక్తికరమైన విషయమేమంటే.. ఈసినిమాలో అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ కీలక పాత్రలో నటిస్తు న్నారంటూ వార్తలు వినిపిస్తున్నాయి. సీనియర్ నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మాతగా శ్రీమాన్ వేముల ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. కాగా.. తాజా సమాచారం మేరకు ఈ సినిమాలో నాగశౌర్య ఓ ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నారట.

## అలా.. చార్ట్ బస్టర్లు కావాలని అడిగిన మహేష్?



2020 సంక్రాంతి బరిలో రిలీజైన అల వైకుంఠపురములో – సరిలేరు నీకెవ్వరు బాక్సాఫీస్ వద్ద హోరాహోరీగా వసూళ్లు సాధించాయి. అయితే సరిలేరు నీకెవ్వరు మ్యూజిక్ తో పోలిస్తే.. అల మ్యూజిక్ బంపర్ హిట్టు అన్న టాక్ వచ్చింది. అల వైకుంఠపురములో అన్ని పాటలు చార్ట్ బస్టర్ జాబితాలో నిలిస్తే సరిలేరు... నుంచి ఒకటీ అరా మాత్రమే ఆ స్థాయిని అందుకున్నాయి. కారణం ఏదైనా దేవీశ్రీపై ఎస్.ఎస్.థమన్ పై చేయి సాధించాడన్నది వాస్తవం. ఇక దేవీశ్రీ రొటీన్ మ్యూజిక్ పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడం థమన్ ని నెటిజనం ఆకాశానికెత్తేయడం తెలిసినదే. కారణం ఏదైనా కానీ ఇప్పుడు టాలీవుడ్ లో థమన్ హవా నడుస్తోంది. అంతటా థమనే కనిపిస్తున్నాడు. అల ఇచ్చిన స్ఫూర్తి అనాలో లేక జాగ్రత్త అనాలో కానీ.. మహేష్ వెంటనే థమన్ ని లాక్ చేశాడు. ప్రస్తుతం పరశురామ్ దర్శకత్వంలోని సర్కార్ వారి పాట కోసం థమన్ బాణీల్ని సిద్ధం చేస్తున్నాడు. ఫ్యాన్స్ అంచనాలకు తగ్గకుండా ఈ సినిమా బాణీల్ని అందించాలని మహేష్ సూచించారట. ఇక మహేష్ – థమన్ కాంబినేషన్ అనగానే బిజినెస్ మేన్ – దూకుడు– ఆగడు వంటి సినిమాలు గుర్తుకొస్తాయి. ఆ సినిమాల పాటలు బీజీఎం ప్రతిదీ ఆకట్టుకున్నాయి. అందువల్ల ఇప్పుడు మరోసారి సేమ్ కాంబినేషన్ రిపీటవుతోంది అనగానే ఘట్టమనేని అభిమానుల్లో నూతనోత్సాహం నెలకొంది. సంగీతం విషయంలో అంతకు మించి అంచనాలు ఏర్పడ్డాయి. అన్నట్టు ఈ ఊపులో థమన్ కాపీ ట్యూన్లు ఇవ్వడమే బాలేదంటూ ఇటీవల కొన్ని విమర్శలు వస్తున్నాయి. వాటన్నిటినీ అధిగమించి పూర్తిగా ఏ.ఆర్.రెహమాన్ లా ఒరిజినల్ ట్యూన్స్ ని వినిపించే ప్రయత్నం చేస్తే బావుంటుందన్నది అభిమానుల సూచన. తనను నమ్మిన మహేష్ కోసం ఆమాత్ర శ్రద్ధ పెడతారని అంతా భావిస్తున్నారు. ఇప్పటికే థమన్ కూడా ఇప్పటికే అదిరిపోయే ట్యూన్స్ కొన్ని చేసారట.మహేష్‌కోసం ఇంట్రడక్షన్ సాంగ్ .. బీజీఎం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారని సమాచారం. ఇప్పటికే రిలీజైన సర్కార్ వారి పాట మోషన్ పోస్టర్ టీజర్ లో థీమ్ మ్యూజిక్ ఆకట్టుకుంది. ఓవరాల్ గా చార్ట్ బస్టర్లు ఇవ్వాల్సిన అవసరం కనిపిస్తోంది. ఈ చిత్రంలో మహేష్ సరసన కీర్తి సురేష్ నాయిక. మైత్రి మూవీ మేకర్స్ – 14 రీల్స్ –జీఎంబీ సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నాయి.

## ఆకాశమే హద్దుగా కళ్లతోనే మాయ చేస్తాడు!




కొందరు కళ్లతోనే కోటి భావాలు పలికిస్తారు. పలువురు హీరోలకు నయనాలు ప్రధాన ఆకర్షణ. ఇంకా చెప్పాలంటే కంటి చూపుతోనే పడేస్తారు. తమదైన ప్రతిభతో కోట్లాదిగా అభిమానుల్ని సంపాదించుకున్నా హీరోయిక్ అప్పియరెన్స్ కూడా అందుకు ఒక కారణం అవుతుంది. టాలీవుడ్ లో మెగాస్టార్ చిరంజీవి కళ్లు ఎంతో అందమైనవి అని అభిమానులు అంటారు. ఆ తర్వాత పవన్ కల్యాణ్ .. మహేష్ లాంటి స్టార్ల కళ్లకు అభిమానులున్నారు. అటు కోలీవుడ్ కి వెళితే స్టార్ హీరో సూర్య కళ్లకు ప్రత్యేకించి ఫ్యాన్సున్నారు. అతడికి ఆ నయనాలే ప్రధాన ఆకర్షణ. అది మరోసారి ఇదిగో ఇలా మాస్క్ వల్ల క్లియర్ కట్ గా బయటపడింది. కళ్లతోనే కోటి భావాలు పలికించడంలో సూర్య కు ఉన్న ప్రత్యేకతే వేరని.. అలా మాస్క్ ధరించి చిరునవ్వులు చిందిస్తుంటే ఆ నయనాల అందం మరింతగా హైలైట్ అయ్యిందని ఫ్యాన్స్ చెబుతున్నారు. మాస్క్ హైలైట్ చేసిన అందమైన కళ్ళు ఈ ఫోటోలో కనిపిస్తున్నాయి. సూర్య చాలా స్టైలిష్ గా నీలిరంగు టీ–షర్టు .. ముదురు నీలిరంగు ప్యాంటులో తన ఇంటి నుండి బయటికి వచ్చినప్పుడు ఇలా క్లిక్ మంది ఫోటో. ఈ గెటప్ లో అతని పొడవాటి జుట్టు పెద్ద ఆకర్షణగా నిలిచింది. అన్నిటినీ మించి అతని రూపంలో ఏదో కొత్తదనం కనిపిస్తోంది. ఈ లుక్ సంథింగ్ స్పెషల్ గా హాట్ గా కనిపిస్తోందని అభిమానులు అంటున్నారు. చాలా ప్రయత్నాల తర్వాత ఆకాశమే నీ హద్దురా చిత్రంతో సక్సెస్ అందుకున్న సూర్య తదుపరి క్రేజీ చిత్రాల్లో నటిస్తున్నారు.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989